100 రోజుల ప్రణాళికతో
సత్ఫలితాలు

» ఎస్.దిలీప్‌కుమార్, నగర పాలక సంస్థ కమిషనర్



ముఖాముఖి

ప్రశ్న: వంద రోజుల ప్రణాళికతో ఎలాంటి ఫలితాలు వచ్చాయి?

జవాబు: నిజామాబాద్ నగర కార్పొరేషన్‌లో అనేక ప్రాంతాల్లో చెత్తా చెదారం పేరుకుపోయింది. దానిని దృష్టిలో పెట్టుకొని వంద రోజుల ప్రణాళికలో భాగంగా నగరంలోని ఆరు సర్కిల్‌లలో ప్రతీసర్కిల్‌కు 10 నుంచి 15 మంది సానిటేషన్ సిబ్బందితో స్పెషల్ టీమ్‌లను ఏర్పాటు చేసి మెరుగైన ఫలితాలను సాధించాం.

ప్ర: పారిశుద్ధ వ్యవస్థలో ఎలాంటి సమస్యలు గుర్తించారు?
జ: నగరంలో ప్రతీరోజు ఉదయం చెత్త తీసుకెళ్లేందుకు ప్రత్యేక వాహనాలు వెళ్తాయి. కానీ కొంత మంది ఉద్యోగాలు చేసేవారు ఉదయం కాకుండా చెత్తను 10, 11 గంటల ప్రాంతాల్లో చెత్త వేసే ప్రాంతాల్లో వేస్తుండటంతో అక్కడ చెత్త పేరుకుపోయి చెత్త తీయని వాతావరణాన్ని గుర్తించాం. వారికి అవగాహన కల్పిస్తూ ఉదయమే చెత్త వేసేలా ప్రయత్నాలు చేస్తున్నాం.

ప్ర: స్వచ్ఛ సర్వేక్షణ్‌లో మెరుగైన ర్యాంకుకు ఎలాంటి చర్యలు తీసుకుంటున్నారు?
జ: స్వచ్ఛ సర్వేక్షణ్‌లో నిజామాబాద్ నగర పాలక సంస్థకు మెరుగైన ర్యాంకు కోసం ఇంటి వద్దే చెత్త వేరుచేసి తడి చెత్త పొడి చెత్త వేరువేరుగా వేసేలా ప్రజలకు అవగాహన కల్పిస్తున్నాం. నగరంలో 10 వార్డులను పైలెట్ ప్రాజెక్టుగా తీసుకొని శానిటరి ఇన్స్‌పెక్టర్లు, జవాన్‌లు, మెప్మా రిసోర్స్‌పర్సన్‌ల ద్వారా ప్రజలకు అవగాహన కల్పిస్తున్నాం.

ప్ర: పారిశుద్ధం సమస్య పరిష్కారానికి ఎలాంటి చర్యలు తీసుకుంటున్నారు?
జ: నగరంలో పారిశుధ్య సమస్య ఎక్కువగా ఉన్న ప్రాంతాల్లో స్పెషల్ టీమ్‌లను ఏర్పాటు చేశాం. ప్రతీరోజు సానిటరి ఇన్‌స్పెక్టర్లు, జవాన్‌ల ద్వారా పర్యవేక్షణ చేస్తూ ఏరోజు చెత్త ఆరోజు తొలగించేలా చూస్తున్నాం. ఎక్కడ సమస్య ఉన్నా అందుబాటులో ఉంటూ నగరాన్ని పరిశుభ్రమైన నగరంగా తీర్చిదిద్దేందుకు కృషి చేస్తున్నాం.

- నిజామాబాద్, (ఆంధ్రజ్యోతి ప్రతినిధి)



వ్యవసాయ మార్కెట్‌లో..
వసూల్ రాజా!

'డబుల్' ఇళ్ల పేరిట దండుకున్న లంచావతారం

» గుమస్తా, దడ్వాయి, హమాలీ, చాటా కార్మికులను వదలని వైనం
» ఒక్కో కార్మికుడి నుంచి రూ.50 వేల వరకు..
» సూత్రధారిగా మార్కెట్ కమిటీ కీలక నేత
» అధికార పార్టీ నాయకుడి వైఖరిపై సర్వత్రా విమర్శలు
» బలిపశువులైన సంఘాల నాయకులు..
» సీనియర్లను విస్మరించడంతో విషయం వెలుగులోకి
» యూనియన్ సమావేశంలో పలువురి మధ్య వాగ్వాదం
» లక్కీడ్రా ద్వారా లబ్ధిదారులను ఎంపిక చేయనున్న అధికారులు

రెక్కాడితే కాని డొక్కాడని శ్రమజీవులకు డబుల్ ఇళ్ల ఆశ చూపాడు.. డబుల్ ఇళ్ల పేరిట ఒక్కో వ్యక్తి నుంచి రూ. 50 వేల వరకు దండుకున్నాడు.. మార్కెట్‌లో ఉండే పెద్ద నాయకుడు కావడంతో ఎవరికీ అనుమానం రాలేదు.. సీనియర్లను పక్కన పెట్టడంతో విషయం బయటకు పొక్కింది. జిల్లా కేంద్రంలోని శ్రద్ధానంద్ గంజ్‌లో గుమస్తా నుంచి చాటా కార్మికుల వరకు బాధితులు ఉన్నారు. నిలువ నీడ దొరుకుతుందనే భావనలో చెమటను చిందించి దాచుకున్న డబ్బును కుర్చీలో కూర్చున్న బడా వ్యక్తికి అప్పగించారు. తమ కష్టార్జితాన్ని గద్దలా తన్నుకుపోయిన వ్యక్తిని నిలదీసే ధైర్యం వారిలో లేకపోయింది. యూనియన్ మీటింగ్‌లో ఒక్కొక్కరిగా నోరు విప్పడంతో విషయం బయటకు వచ్చింది.

దళారులను నమ్మి
మోసపోవద్దు..
: దిలీప్‌కుమార్, నగర పాలక సంస్థ కమిషనర్

డబుల్ బెడ్‌రూం ఇళ్ల కేటాయింపు విషయంలో ఎవరూ కూడా దళారులను నమ్మి మోసపోవద్దు. ప్రజాపాలనలో వచ్చిన దరఖాస్తులలో ఇంటి స్థలం లేని వారిని గుర్తించి వారి విషయాలను క్షేత్రస్థాయిలో పరిశీలించిన తర్వాతనే లక్కీడ్రా ద్వారా లబ్ధిదారుల ఎంపిక జరుగుతుంది. కాబట్టి ఎవరూ కూడా డబుల్ బెడ్‌రూం ఇళ్ల కోసం డబ్బులు ఇవ్వొద్దు.

నిజామాబాద్, అక్టోబరు 6 (ఆంధ్రజ్యోతి ప్రతినిధి): గత ప్రభుత్వ హయాంలో మంజూరై ఇటీవల పనులు పూర్తయి పంపిణీకి నోచుకోని డబుల్ బెడ్‌రూం ఇళ్లను అర్హులైన పేదలకు ఇవ్వాలని జిల్లా అధికారులు నిర్ణయించగా అదే అదనుగా నిజామాబాద్ మార్కెట్‌లో కీలక పదవిలో ఉన్న నాయకుడు వసూళ్లకు పాల్పడటం నిజామాబాద్ శ్రద్ధానంద్ గంజ్‌లో తీవ్ర చర్చనీయాంశం అవుతుంది. గంజ్‌లో అనేక సంవత్సరాలుగా పనిచేస్తున్న గుమస్తా, హమాలీ, దడ్వాయి, చాటా కార్మికులకు నగర శివారులోని బైపాస్ రోడ్‌లో నిర్మాణంలో ఉన్న డబుల్ బెడ్‌రూం ఇళ్లను కేటాయించాలని అధికారులు నిర్ణయించారు. దాన్ని ఆసరాగా చేసుకొని ఓ ప్రజాప్రతినిధి కార్మికుల నుంచి డబ్బులు వసూలు చేస్తున్న విషయం బయటపడింది.

కొత్త కలెక్టరేట్ పక్కన గత ప్రభుత్వ హయాంలో మంజూరైన 252 ఇళ్లు దాదాపు పూర్తి కాగా వాటిని మరో 15-20 రోజుల్లో అర్హులైన లబ్ధిదారులకు ఇచ్చేందుకు అధికారులు సిద్ధమవుతుండగా అందులో రూరల్ నియోజకవర్గానికి 50, నిజామాబాద్ అర్బన్ నియోజకవర్గానికి 202 కేటాయించేందుకు అధికారులు ఒక నిర్ణయానికి వచ్చినట్లు తెలుస్తోంది. 202 గృహాల్లో సానిటేషన్ వర్కర్లు, స్కావెంజర్లు, గుమస్తాలు, దడ్వాయి, చాటా, హమాలీలకు అవకాశం కల్పించనున్నట్లు అధికారుల నుంచి సమాచారం రాగా ఇదే అదనుగా సదరు నాయకుడు వసూళ్లకు పాల్పడుతున్నట్లు సమాచారం. నాలుగు సంఘాలకు కలిపి 120 ఇళ్లు ఇచ్చేందుకు అధికారులు అంగీకరించారని చెబుతూ ఒక్కో సంఘానికి 40 ఇళ్లు ఇస్తామని ఒక్కో ఇంటికి రూ.30 నుంచి 50వేలు ఇవ్వాలని సంఘాల నాయకుల ద్వారా సదరు ప్రజాప్రతినిధి వసూళ్లకు పాల్పడుతున్నట్లు ఆరోపణలు వస్తున్నాయి. ప్రభుత్వం పేదలకు ఇచ్చే గృహాల విషయంలో అధికార పార్టీకి చెందిన ప్రజాప్రతినిధి కార్మికుల నుంచి డబ్బులు వసూలు చేయడంపై సర్వత్ర విమర్శలు వ్యక్తమవుతున్నాయి. నిజామాబాద్ రూరల్ ప్రజాప్రతినిధి అండదండ తనకు ఉన్నట్లు సదరు నాయకుడు చెప్పడం నిజామాబాద్ మార్కెట్ కమిటీలో అవినీతికి మరింత ఆజ్యం పోసినట్లు అవుతుంది.

దాదాపు పూర్తయిన ఇళ్ల నిర్మాణం

నిజామాబాద్ బైపాస్ రోడ్‌లోని కొత్త కలెక్టరేట్ పక్కన గత ప్రభుత్వ హయాంలో 252 ఇళ్లు మంజూరు కాగా దాదాపు వాటి నిర్మాణం పూర్తయింది. ప్రజా పాలనలో వచ్చిన దరఖాస్తుల్లో ఇంటి స్థలం లేనివారికి మొదటి ప్రాధాన్యంగా డబుల్ బెడ్‌రూం ఇళ్లను

మిగతా 6వ పేజీలో...



సాయిచైతన్య, పోలీస్ కమిషనర్

అప్రమత్తతతోనే సైబర్ మోసాలకు
ముకుతాడు

» మోసానికి గురైతే 1930ను సంప్రదించాలి
» పోలీస్ కమిషనర్ సాయిచైతన్య

సుభాష్‌నగర్, అక్టోబరు 6 (ఆంధ్రజ్యోతి): సైబర్ మోసాలపట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, సైబర్ మోసానికి గురైతే వెంటనే 1930 నెంబర్‌ను సంప్రదించాలని పోలీస్ కమిషనర్ సాయిచైతన్య అన్నారు. మార్చి నుంచి సెప్టెంబర్ వరకు 33 సైబర్ కేసులు నమోదు అయ్యాయని తెలిపారు. ప్రస్తుతం సోషల్ మీడియా, డిజిటల్ మార్కెటింగ్, ఇన్వెస్టిమెంట్, డిజిటల్ అరెస్ట్ మోసాలు జరుగుతున్నాయని అన్నారు. ఎవరైనా సైబర్ నేరాల ఉచ్చులో పడితే వెంటనే 1930 నెంబరు ద్వారా సైబర్ క్రైమ్‌కు రిపోర్ట్ చేయాలని అన్నారు. జాతీయ సైబర్ క్రైమ్ హెల్ప్‌లైన్ నెంబర్‌ను సంప్రదించిన వారి అకౌంట్‌లో డబ్బులను ఆపుతామన్నారు. ప్రతీవారం జిల్లా సైబర్ క్రైమ్ బృందంతో గ్రామాల్లో అవగాహన కార్యక్రమాలు నిర్వహించి ప్రస్తుత సమాజంలో

మిగతా 6వ పేజీలో...

తీర్థయాత్రలకు
చలో.. చలో..
» ఐఆర్‌సీటీసీ ప్రత్యేక పర్యాటక రైలు
6

17 నుంచి19 వరకు
లక్ష్మీ కుబేర హోమం
» కరపత్రాలు ఆవిష్కరించిన నిర్వాహకులు

అదే..
ఉత్కంఠ



» బీసీ రిజర్వేషన్‌పై సుప్రీం కోర్టులో పిటిషన్ కొట్టివేత
» హైకోర్టులోనే తేల్చుకోండని చెప్పిన అత్యున్నత న్యాయస్థానం
» 8వ తేదీ హైకోర్టు తీర్పు కోసం ఆశావహుల ఎదురుచూపు

నిజామాబాద్, అక్టోబరు 6 (ఆంధ్రజ్యోతి ప్రతినిధి): రాష్ట్ర ప్రభుత్వం బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు పెంచుతూ విడుదల చేసిన జీవో నంబర్ 9పై దాఖలైన పిటిషన్‌ను సుప్రీం కోర్టు సోమవారం కొట్టివేయడంతో అందరి చూపు ఈనెల 8న హైకోర్టు ఇచ్చే తీర్పుపై పడింది. రాష్ట్ర ప్రభుత్వం బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు కల్పిస్తూ జీవో విడుదల చేయగా అధికారులు సైతం ఆ రిజర్వేషన్ల ఆధారంగానే స్థానిక సంస్థల ఎన్నికల రిజర్వేషన్లను ప్రకటించారు. గతంలో కంటే బీసీలకు జడ్పీటీసీ, ఎంపీటీసీ స్థానాలు గణనీయంగా పెరిగాయి. ఈ నేపథ్యంలో జిల్లాలో 31 జడ్పీటీసీ, 307 ఎంపీటీసీ స్థానాలకు అధికారులు రిజర్వేషన్లను ప్రకటించారు. బీసీలకు 42 శాతం రిజర్వేషన్లను సవాలు చేస్తూ కొంత మంది హైకోర్టుతో పాటు సుప్రీం కోర్టుకు వెళ్లడంతో అసలు రిజర్వేషన్లు ఇవే ఉంటాయా, ఉండవా అనే సందేహంలో ఎన్నికల్లో పోటీ చేయాలనుకునే ఆశావహులు ఉన్నారు. 50 శాతం రిజర్వేషన్లు మించవద్దని

మిగతా 6వ పేజీలో...

అందరి చూపు 8 పైనే..

42 శాతం బీసీలకు రిజర్వేషన్లు కల్పిస్తూ ప్రభుత్వం విడుదల చేసిన జీవోను సవాలు చేస్తూ సుప్రీం కోర్టులో దాఖలైన పిటిషన్‌ను కోర్టు కొట్టివేయడంతో అందరి చూపు ఈనెల 8 పైనే ఉంది. రాష్ట్ర ప్రభుత్వం స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీలకు గతంలో ఉన్న 23 శాతం రిజర్వేషన్లను 42 శాతానికి పెంచుతూ జడ్పీటీసీ, ఎంపీటీసీ, జడ్పీ చైర్మన్, మండల పరిషత్ చైర్మన్ల రిజర్వేషన్లను ప్రకటించింది. సుప్రీం కోర్టు గతంలో 50 శాతం రిజర్వేషన్ల పరిమితి దాటవద్దని రాష్ట్ర ప్రభుత్వం నూతనంగా ఇచ్చిన రిజర్వేషన్ల జీవోతో రాష్ట్రంలో రిజర్వేషన్లు 67 శాతానికి పెరుగుతాయని ఇది రాజ్యాంగ విరుద్ధం అని కొంత మంది సుప్రీం కోర్టును ఆశ్రయించారు. సోమవారం సుప్రీం కోర్టు పిటిషన్‌ను కొట్టివేస్తూ హైకోర్టులోనే తేల్చుకోవాలని 42 శాతం బీసీ రిజర్వేషన్ల అంశం హైకోర్టులో పెండింగ్‌లో ఉందని వ్యాఖ్యానించింది.



మధ్య తరగతికి
'అద్దె'ల దరువు

» నగరంలో భారంగా మారిన నివాసం
» ఐదంకెలు దాటిన కిరాయి
» లిఖిత పూర్వక ఒప్పందాలు కరువు
» ఇష్టానుసారంగా అద్దెల నిర్ణయం
» చితికిపోతున్న సగటు వేతన జీవి
» నేడు ప్రపంచ ఆవాస దినోత్సవం

ఇందూరు, అక్టోబరు 6 (ఆంధ్రజ్యోతి): నిజామాబాద్ నగరంలో మధ్యతరగతి కుటుంబాలకు అద్దె ఇల్లు పొందడం ఒక పెద్ద సవాలుగా మారింది. ఇళ్ల అద్దెలు అంచెలంచెలుగా పెరిగిపోతుండగా, ఆదాయం మాత్రం స్థిరంగా ఉండటం వల్ల మధ్యతరగతి

మిగతా 6వ పేజీలో...



వర్నిలో భూ భారతిపై సమీక్షిస్తున్న కలెక్టర్

దరఖాస్తుల పెండింగ్‌పై
కలెక్టర్ అసహనం

» భూభారతిపై సత్వరమే స్పందించాలని ఆదేశం
» వర్ని తహసీల్దార్ కార్యాలయాన్ని తనిఖీ చేసిన కలెక్టర్

వర్ని, అక్టోబరు 6 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న భూ భారతి కార్యక్రమం ద్వారా భూ సంబంధిత సమస్యలను సత్వరం పరిష్కరించాలని కలెక్టర్ టి.వినయ్ కృష్ణారెడ్డి రెవెన్యూ సిబ్బందిని ఆదేశించారు. సోమవారం తహసీల్దార్ కార్యాలయాన్ని ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. రెవెన్యూ సదస్సుల్లో వచ్చిన దరఖాస్తు ఎన్ని దరఖాస్తులను పరిష్కరించారని తహసీల్దార్ సాయిలును ప్రశ్నించారు. ఈ ఎన్ని పెండింగ్‌లో ఉన్నాయని ,ఎంత మందికి నోటీసులు ఇచ్చారని కలెక్టర్ అడిగి తెలుసుకున్నారు. క్షేత్ర స్థాయిలో పరిశీలనలో ఒకింత జాప్యం జరగడాన్ని గమనించిన కలెక్టర్ అసహనం వ్యక్తం చేశారు. దరఖాస్తులు తిరస్కరణకు గురైతే అందుకు గల కారణాలను స్పష్టంగా పేర్కొనాలని సూచించారు. భూ భారతి దరఖాస్తులకు అత్యంత ప్రాధాన్యం ఇవ్వాలని కలెక్టర్ స్పష్టం చేశారు. సాదా బైనామా, పీవోటీ, దరఖాస్తుల సంఖ్య పై ఆరా తీశారు. నిర్ణీత గడువు లోగా అన్ని దరఖాస్తులు పరిష్కారం అయ్యేలా చూడాలని ఆదేశించారు. భూ భారతిలో వచ్చిన ప్రతి ఫిర్యాదుపై తక్షణ చర్యలు తీసుకోవాలని ఆయన ఆదేశించారు.

ఎస్సారెస్పీకి కొనసాగుతున్న వరద

● 26 గేట్లను ఎత్తి గోదావరిలోకి నీటి విడుదల

మెండోరా, అక్టోబరు 6(ఆంధ్రజ్యోతి): శ్రీరాంసాగర్ ప్రాజెక్టుకు ఎగువ నుంచి వరద కొనసాగుతోంది. దీంతో అధికారులు 26 గేట్లను ఎత్తి గోదా వరిలోకి నీటిని విడుదల చేస్తున్నారు. జలాశయంలోకి ప్రస్తుతం 1,11,270 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో రాగా సోమవారం 26 గేట్ల ద్వారా నీటిని వదులుతున్నారు. ప్రాజెక్ట్ పూర్తిస్థాయి నీటిమట్టం 1091 అడుగులు (80.5 టీఎంసీలు) కాగా.. ప్రస్తుతం 1090.90 అడుగుల (80.05 టీఎం సీలు) నీరు ఉంది. ప్రాజెక్ట్ నుంచి వరద గేట్ల ద్వారా 1,01,480 క్యూ సెక్కులు,ఎస్కేప్ గేట్ల ద్వారా 4 వేల క్యూ సెక్కులు వదులుతు న్నారు. కాకతీయ కాలువకు 4వేలు, సరస్వతి కాలువకు 650, లక్ష్మి కాలువకు 200, మిషన్ భగిరథకు 231 క్యూ సెక్కులు విడుదల చేస్తున్నారు.





బిల్లుల కోసం..
హై కోర్టుకు

» బకాయిలు చెల్లించాలని కాంట్రాక్టర్ వేడుకోలు
» రూ.3 కోట్ల కోసం బోధన్ మున్సిపాలిటీపై పిటిషన్
» పది రోజుల్లో బిల్లులు చెల్లించాలని న్యాయస్థానం ఆదేశాలు

బోధన్, అక్టోబరు 6 (ఆంధ్రజ్యోతి): పట్టణాభివృద్ధి కోసం అప్పులు తెచ్చి పనులు చేపట్టిన ఓ కాంట్రాక్టర్‌కు మున్సిపల్ అధికారులు బకాయిలు చెల్లించక పోవడంతో సదరు కాంట్రాక్టర్ హైకోర్టును ఆశ్రయించారు. ఏకంగా రూ.3 కోట్ల బిల్లులు రావాలంటూ హైకోర్టును ఆశ్రయించడంతో పది రోజుల్లోగా బకాయిలు చెల్లించాలని బోధన్ మున్సిపాలిటీకి న్యాయస్థానం నోటీసులు జారీ చేసిందని సమాచారం. ఖజానా ఖాళీ ఉండడంతో అన్ని విధాలుగా ప్రయత్నించినా, నిధుల లేమితో కమిషనర్ రెండు రోజుల్లో హై కోర్టుకు వెళ్లనున్నట్లు సమాచారం. బోధన్ పట్టణ ప్రగతి కోసం ఖర్చు చేసిన మొత్తం బిల్లులు రూ.6.50కోట్లు కాంట్రాక్టర్‌లకు బకాయి బిల్లులు చెల్లించాల్సి ఉంది. నాలుగేళ్ల క్రితం పట్టణ ప్రగతిలో ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు సీసీ రోడ్డులు, డ్రైనేజీలు, ఇంటిగ్రేటెడ్ మార్కెట్ పనులు చేపట్టిన కాంట్రాక్టర్ బిల్లుల కోసం కార్యాలయం చుట్టూ, ఉన్న తాధికారుల చుట్టూ చెప్పులు అరిగేలా తిరిగినా బిల్లులు రాకపోవ డంతో చివరకు కోర్టును ఆశ్రయించారు. పట్టణ ప్రగతి కోసం అప్పులు తెచ్చి పనులు చేపడితే తాను అప్పుల్లో కూరుకుపోయానని సదరు కాంట్రాక్టర్ వాపోతున్నారు. చేసేదేమి లేక బిల్లులు చెల్లించి తనను ఆర్థికంగా ఆదుకోవాలంటూ కాంట్రాక్టర్ హైకోర్టును ఆశ్రయించడంతో హైకోర్టు బోధన్ మున్సిపాలిటీకి నోటీసులు జారీ చేయడం చర్చనీయాంశంగా మారింది. కాంట్రాక్టర్ పిటీషన్‌ను పరిశీలించిన హైకోర్టు 10 రోజుల్లోగా బిల్లులు చెలించాలంటూ ఆదేశాలు జారీ చేయడం గమనార్హం. పట్టణ ప్రగతికి నిధుల లేమితో అధికారులు తలలు పట్టుకుంటున్నారు.

మిగతా 6వ పేజీలో...



సమస్యాత్మక పోలింగ్ స్టేషన్లను
గుర్తించాలి

» ఏసీపీ రాజావెంకట్‌రెడ్డి

మాక్లూర్, అక్టోబరు 6(ఆంధ్రజ్యోతి): ఎన్నికల నేపథ్యలో సమస్యాత్మక పోలింగ్ స్టేషన్‌లను గుర్తించి కట్టుదిట్టమైన చర్యలు తీసుకోవాలని ఏసీపీ రాజావెంకట్‌రెడ్డి ఆదేశించారు. ఆయన సోమవారం మాక్లూర్ పోలీస్ స్టేషన్‌ను సందర్శించారు. ఈ సందర్భంగా సిబ్బందికి పలు సూచనలు చేశారు. రాబోయే ఎన్నికల దృష్టిలో ఉంచుకొని ఆయా గ్రామ పోలీస్ అధికారులు గ్రామములో పరిస్థితులు పై ఎప్పటికప్పుడు తగిన నిఘా ఉంచాలని అన్నారు. ఆలస్యం చేయకుండా సమాచారాన్ని ఉన్నతాధికారులకు తెలియజేయాలని సూచించారు. శాంతి భద్రతలకు విఘాతం కలిగించే వ్యక్తులకపై కఠినంగా వ్యవహరించాలని అన్నారు. ఈ కార్యక్రమంలో సీఐ శ్రీనివాస్, ఎస్సై రాజశేఖర్, సిబ్బంది పాల్గొన్నారు.

క్రైం సమాచారం

మద్యానికి బానిసై వ్యక్తి ఆత్మహత్య

మాచారెడ్డి, అక్టోబరు 6(ఆంధ్రజ్యోతి): మద్యానికి బానిసై ఒకరు ఆత్మహత్య చేసుకున్న ఘటన మండలంలోని కొత్తపల్లిలో సోమవారం చోటుచేసుకుంది. ఎస్సై అనిల్ కథనం ప్రకారం.. గ్రామానికి చెందిన బరిగా నాంపల్లి(54) కుమారుడు, కూతురు గతంలో మరణించారు. అప్పటి నుంచి నాంపల్లి మద్యానికి బానిసయ్యాడు. జీవితంపై విరక్తి చెంది సోమవారం తెల్లవారుజామున పొలం వద్ద చెట్టుకు ఉరేసుకున్నాడు. మృతుడి భార్య నర్సవ్వ ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు.

భార్య కాపురానికి రావడం లేదని బలవన్మరణం

భిక్కనూరు, అక్టోబరు6(ఆంధ్రజ్యోతి): మండలంలోని పెద్దమల్లారెడ్డి శివారులో యువకుడు ఉరేసుకొని ఆత్మహత్య చేసుకున్నట్లు ఎస్సై ఆంజనేయులు తెలిపారు. ఆయన కథనం ప్రకారం.. బీబీపేట మండలం కోనాపూర్‌కు చెందిన గోర్కంటి స్వామి(26)కి భిక్కనూరు మండలం మల్లుపల్లికి చెందిన శిరీషతో 4 ఏళ్ల కిందట వివాహమైంది. వారికి ఒక కూతురు ఉంది. ఏడాది నుంచి భార్యభర్తకు గొడవలు జరుగుతుండటంతో శిరీష తన తల్లిగారింటి వద్ద ఉంటోంది. భార్య కాపురానికి రావడం లేదని మనస్తాపానికి గురైన స్వామి పెద్దమల్లారెడ్డి శివారులో సబ్‌స్టేషన్ సమీపంలో చెట్టుకు ఉరేసుకున్నాడు. ఘటనపై కేసు నమోదు చేసి, మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం కామారెడ్డి ఏరియా ఆసుపత్రికి తరలించారు.

జీవితంపై విరక్తి చెంది ఒకరు..

రెంజల్,అక్టోబరు6(ఆంధ్రజ్యోతి):మండలకేంద్రానికి సింగ సాయిలు(41) జీవితంపై విరక్తి చెందిన ఆత్మహత్యకు పాల్పడ్డారని ఎస్సై చంద్రమోహన్ తెలిపారు. సాయిలు భార్య ఆరు నెలల క్రితం మృతి చెందిందని, ఆమె మృతిని తట్టుకోలేక మానసిక వేదనకు గురై జీవితంపై విరక్తి చెంది ఇంట్లోని గిరక బావిలో దూకి ఆత్మహత్య చేసుకుని మృతి చెందాడన్నారు. మృతదేహన్ని పోస్టుమార్టం నిమిత్తం బోధన్ ఏరియా ఆసుపత్రికి తరలించి, మృతుడి తండ్రి చిన్న లక్ష్మన్న ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు వివరించారు.

ఉరేసుకొని మరొకరు...

భిక్కనూరు, అక్టోబరు 6(ఆంధ్రజ్యోతి): మద్యానికి బానిసై యువకుడు ఆత్మహత్య చేసుకున్న ఘటన మండలంలోని పెద్దమల్లారెడ్డిలో చోటుచేసుకుంది. ఎస్సై ఆంజనేయులు కథనం ప్రకారం.. గ్రామానికి చెందిన చల్ల సాయి తేజ(23) కొన్నిరోజులుగా మద్యానికి బానిసై జులాయిగా తిరుగుతుండేవాడు. అతడి ఆరోగ్యం సైతం సరిగా ఉండేది కాదని, దీంతో జీవితంపై విరక్తి చెంది ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఉరేసుకున్నాడు. మృతుడి తండ్రి రమేష్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం కామారెడ్డి జిల్లా ఆసుపత్రికి తరలించారు.

ఇసుక ట్రాలీ ఢీ.. గేదె మృత్యువాత

ఎడపల్లి, అక్టోబరు 6 (ఆంధ్రజ్యోతి): ఎడపల్లి శివారులోని నీళ్ల మడుగు వద్ద సోమవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఒక గేదె మృతి చెందగా ఇంకో గేదె గాయపడింది. స్థానికుల కథనం ప్రకారం.. బోధన్-నిజామాబాద్ ప్రధాన రహదారి గుండా మేతకు వెళ్తున్న గేదెలను వెనుక నుంచి ఇసుక లోడుతో వస్తున్న మినీ ఆటో ట్రాలీ ఢీ కొట్టింది. ప్రమాదంలో నయాబాది కాలనీలో ఉండే సాయల మహేందర్‌కు చెందిన ఒక గేదె మృతి చెందగా ఇంకో గేదె కాలు విరిగిందని తెలిపారు. తనకు లక్షా ఇరవై వేల రూపాయల వరకు నష్టం వాటిల్లిందని రైతు పేర్కొన్నారు. గేదెను ఢీ కొట్టిన ఆటోను పోలీసులు స్టేషన్‌కు తరలించారు.

డ్రంకెన్ డ్రైవ్‌లో ఐదుగురికి జైలు

కామారెడ్డిటౌన్, అక్టోబరు 6(ఆంధ్రజ్యోతి): మద్యం తాగి వాహనాలు నడిపిన ఐదుగురికి జైలు శిక్ష పడినట్లు దేవునిపల్లి ఎస్సై రంజిత్ తెలిపారు. ఇటీవల నిర్వహించిన వాహనాల తనిఖీల్లో పట్టుబడిన ఐదుగురిని న్యాయమూర్తి చంద్రశేఖర్ ముందు ప్రవేశపెట్టగా ఐదుగురికి ఒక్కరోజు జైలు శిక్షతో పాటు రూ.1000 జరిమానా విధించారని తెలిపారు.

ప్రైవేట్ బస్సుబోల్తా.. పలువురికి గాయాలు

కామారెడ్డిటౌన్, అక్టోబరు 6(ఆంధ్రజ్యోతి): పట్టణ శివారులోని ఎన్‌హెచ్ 44పై తెల్లవారుజామున నాగ్‌పూర్ నుంచి హైదరాబాద్ వెళ్తున్న ఓ ప్రైవేట్ బస్సు సోమవారం ప్రమాదవశాత్తు బోల్తాపడింది. ఇటీవల కురిసిన వర్షాలకు రోడ్డు కుంగిపోవడంతో బస్సు ఒక్కసారిగా రోడ్డు కిందకు పడిపోయింది. బస్సులో సుమారు 30 మంది ప్రయాణికులు ఉండగా నలుగురు తీవ్రంగా.. మిగతా వారు స్వల్పంగా గాయపడ్డారు. స్థానికులు వీరిని వెంటనే కామారెడ్డి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. బస్సు ప్రమాద సమాచారాన్ని తెలుసుకున్న కామారెడ్డి పోలీసులు ఘటనాస్థలానికి వెళ్లి కేసు నమోదుచేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

ఇసుక ట్రాక్టర్ పట్టివేత

బోధన్,అక్టోబరు6(ఆంధ్రజ్యోతి): ఇసుక అక్రమ రవాణా చేస్తున్న ట్రాక్టర్‌ను సోమవారం బోధన్ తహసీల్దార్ విఠల్ పట్టణంలోని ఓగార్డెన్ వద్ద పట్టుకున్నారు. సాలూర మండలం మందర్నా నుంచి ఇసుక అక్రమ రవాణా చేస్తుండగా.. పట్టుకుని తహసీల్దార్ కార్యాలయానికి తరలించామన్నారు.

గంజాయి పట్టివేత.. ముగ్గురి అరెస్టు

సుభాష్‌నగర్, అక్టోబరు6(ఆంధ్రజ్యోతి): గంజాయి అమ్ముతున్న ముగ్గురిని అరెస్టు చేసినట్లు ఎక్సైజ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ సీఐ వెంకటేశ్ తెలిపారు. జిల్లా కేంద్రంలోని ఎక్సైజ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ కార్యాలయంలో వివరాలు వెల్లడించారు. సోమవారం మధ్యాహ్నం నగరంలోని ప్రగతినగర్‌లో ఎండు గంజాయి అమ్ముతుండగా ముగ్గురిని అదుపులోకి తీసుకొని, వారి నుంచి 7కిలోల 700 గ్రాముల గంజాయిని, 2 సెల్‌ఫోన్‌లను స్వాధీనం చేసుకున్నట్లు చెప్పారు. ముగ్గురు నిందితుల్లో ఒకరు ఒడిస్సాకు చెందిన మైనర్ కాగా.. మరో ఇద్దరు సిరికొండకు చెందిన వారని తెలిపారు. ఒడిస్సా నుంచి తక్కువ ధరకు గంజాయిని కొనుగోలు చేసి నగరంలో ఎక్కువ ధరకు అమ్ముతుండగా పక్కా సమాచారం మేరకు దాడి చేసి పట్టుకున్నామన్నారు. దాడుల్లో ఎస్సై రాము కుమార్, హెడ్‌కానిస్టేబుల్ నారాయణరెడ్డి, రాజన్న, భూమన్న, కానిస్టేబుళ్లు భోజన్న, విష్ణు, అవినాశ్, శ్యామ్, సాయి, ఉత్తమ్, రామ్ బచ్చన్, ఆశన్న, లక్ష్మణ్, గంగారాం, మంజుల, సుకన్య పాల్గొన్నారు.

వరద కాలువలో ఒకరి గల్లంతు

కమ్మర్‌పల్లి, అక్టోబరు6:(ఆంధ్రజ్యోతి): కమ్మర్‌పల్లి వద్ద ఇందిరమ్మ వరద కాలువలో పడి గ్రామానికి చెంది కొమిరె రాజేందర్(47) గల్లతయ్యాడు. ఆదివారం సాయంత్రం స్నేహితులతో కలిసి వరద కాలువ వద్దకు వెళ్లిన రాజేందర్ చేతులు కడుక్కోవడానికి కాలువలోకి దిగి కొట్టుకుపోయాడు. ఈ విషయం కుటుంబసభ్యులకు తెలిసి సోమవారం రాత్రి వరకు గాలించినా రాజేందర్ జాడ కనిపించలేదు. ఈ విషయమై తమకెలాంటి ఫిర్యాదు అందలేదని ఎస్సై అనీల్ రెడ్డి తెలిపారు.

తాళం వేసి ఉన్న ఇంట్లో చోరీ

గాంధారి, అక్టోబరు 6(ఆంధ్రజ్యోతి): తాళం వేసి ఉన్న ఇంట్లో దొంగతనం జరిగిన ఘటన మండలకేంద్రంలో చోటుచేసుకుంది. ఎస్సై ఆంజనేయులు కథనం ప్రకారం.. గ్రామానికి చెందిన బర్దావల్ బాలు బీర్మల్ తండాలోని బంధువుల ఇంట్లో పండుగకు ఆదివారం రాత్రి కుటుంబసభ్యులతో కలిసి వెళ్లాడు. హాజరై ఉదయం వచ్చి చూడగా తాళం పగలగొట్టి బీరువాలోని తులం బంగారు నగలు, 60 తులాల వెండి అభరణాలు, నగదును గుర్తుతెలియని దొంగలు ఎత్తుకెళ్లారని అన్నారు. బాలు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని ధర్యాప్తు చేస్తున్నామని ఎస్సై తెలిపారు.

రేపు విద్యుత్ పరిష్కార వేదిక

నవీపేట,అక్టోబరు6(ఆంధ్రజ్యోతి): మండలంలోని జన్నేపల్లి 33/11 సబ్ స్టేషన్ ఆవరణలో ఈ నెల 8న విద్యుత్ వినియోగదారుల సమస్యల పరిష్కార వేదిక నిర్వహించనున్నట్లు ఏడీఈ ప్రశాంత్‌రెడ్డి తెలిపారు. ఉదయం 10:30 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు వినియోగదారులు పాల్గొని తమ సమస్యలను అధికారులకు తెలియజేసి పరిష్కరించుకోవాలని ఆయన కోరారు.



ఆర్మూర్, ఇస్సాపల్లి రహదారిపై ఏర్పడిన భారీ గుంతలు



ఆర్మూర్, మిర్దాపల్లి రహదారిపై రోడ్డు దుస్థితి

ఇవేం దారు(ణా)లు

ఆర్మూర్, అక్టోబరు 6(ఆంధ్రజ్యోతి): ఆర్మూర్ డివిజన్‌లో పంచాయతీరాజ్ రోడ్లన్నీ గుంతలమయమయ్యాయి. దీంతో వాహనదారులు రాకపోకలకు ఇబ్బందులు పడుతున్నారు. గతంలోనే రోడ్లు దెబ్బతిన్నా అధికారులు మరమ్మతులు చేపట్టడంలో జాప్యం చేశారు. దీంతో ఇటీవల కురిసిన భారీ వర్షాలకు రోడ్లపై భారీ గోతులు ఏర్పడ్డాయి. బాల్కొండ నుంచి నందిపేట్, ఆర్మూర్ నుంచి నందిపేటకు వెళ్లే రోడ్డులో ఇస్సాపల్లి సమీపంలో రోడ్డుపై పెద్ద గుంతలు ఏర్పడ్డాయి. అలాగే ఆర్మూర్-మిర్దాపల్లి మార్గంలో ప్రయాణం నరకప్రాయంగా మారింది. నందిపేట మండలం నుంచి నిర్మల్, ఆదిలాబాద్ వైపు వెళ్లే వారికి ఈ రోడ్డు సమీపంగా ఉండడమే కాకుండా ట్రాఫిక్ ఇబ్బందులు లేకుండా ఉంటాయి. ప్రయాణికులు మెరుగైన రవాణా సౌకర్యం ఉంటుందనే ఉద్దేశ్యంతో ఇలా వెళ్తుంటారు. రోడ్లు ధ్వంసం కావడంతో వాహనదారులు ప్రమాదాలకు గురవుతున్నారు. తరచూ ప్రమాదాల బారిన పడుతూ ఆసుపత్రుల పాలవుతున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి రహదారులకు మరమ్మతులు చేపట్టాలని, తమ అవస్థలు తీర్చాలని వాహనదారులు, ఆయా గ్రామాల ప్రజలు కోరుతున్నారు.



ఆత్మీయ సమ్మేళనంలో పాల్గొన్న పూర్వ విద్యార్థులు

అ'పూర్వ' సమ్మేళనం

వేల్పూర్, అక్టోబరు 6(ఆంధ్రజ్యోతి): మండలకేంద్రంలోని జిల్లా పరిషత్ పాఠశాలలో 1994-95 బ్యాచ్ పదో తరగతి విద్యార్థులు 30 ఏళ్ల తర్వాత ఒకచోట చేరారు. లక్కోరాలోని ఓ గార్డెన్స్‌లో సోమవారం ఆత్మీయ సమ్మేళనం నిర్వహించుకున్నారు. ఒకరినొకరు ఆత్మీయంగా పలకరించుకుంటూ యోగ క్షేమాలు అడిగి తెలుసుకున్నారు. చిన్ననాటి జ్ఞాపకాలు నెమరువేసుకొని ఉత్సాహంగా గడిపారు. 30 ఏళ్ల తర్వాత కలుసుకొని మురిసిపోయారు. తమకు విద్యాబుద్దులు నేర్పిన గురువులు సంజీవరెడ్డి, గంగాదర్ గౌడ్, సుదర్శన్, విశ్వనాథం, మురళీదర్‌రెడ్డిని సన్మానించారు. అనంతరం సహపంక్తి భోజనాలు చేశారు.

జాతీయస్థాయికి చిన్నాపూర్ ఉపాధ్యాయులు

మాక్లూర్, (నందిపేట), అక్టోబరు6(ఆంధ్రజ్యోతి): రాజస్థాన్‌లోని జైపూర్‌లో జరుగుతున్న జాతీయ సమావేశాలకు మాక్లూర్ మండలం చిన్నాపూర్ జడ్పీహెచ్ఎస్ ఉపాధ్యాయులు హాజరయ్యారు. ఈనెల 5,6,7వ తేదీల్లో జరుగుతున్న సమావేశాల్లో ఎన్ఈపీ అమలు చేయాలని, సీపీఎస్‌ను రద్దు చేయాలని ప్రతీ తరగతికి ఒక ఉపాధ్యాయుడు ఉండాలని, విద్యారంగానికి అధిక బడ్జెట్ కేటాయించాలని తీర్మానించినట్లు వారు తెలిపారు. అన్ని విద్యాలయాల్లో వసతులు కల్పించి, ఖాళీలను భర్తీ చేయాలని తీర్మానించినట్లు చెప్పారు. తెలంగాణ నుంచి 180మంది ఉపాధ్యాయులు ఈ సమావేశాలకు వెళ్లగా.. జిల్లా నుంచి 13 మంది, రాష్ట్ర, జిల్లా బాధ్యులు పాల్గొన్నారు. చిన్నాపూర్ జడ్పీహెచ్ఎస్‌కు చెందిన తపస్ రాష్ట్ర అదనపు ప్రధాన కార్యదర్శి పాపగారి రామకృష్ణారెడ్డి పాల్గొన్నారు.

పారదర్శకంగా స్థానిక సంస్థల ఎన్నికలు

● జిల్లా అడిషనల్ కలెక్టర్ అంకిత్



ఎన్నికల శిక్షణలో మాట్లాడుతున్న అడిషనల్ కలెక్టర్ అంకిత్

బోధన్,అక్టోబరు6(ఆంధ్రజ్యోతి): స్థానిక సంస్థల ఎన్నికల నిర్వహణపై అధికారులు పారదర్శకంగా ఉండాలని జిల్లా అడిషనల్ కలెక్టర్ అంకిత్ అన్నారు. సోమవారం పట్టణంలోని లయన్స్ క్లబ్ సమావేశపు మందిరంలో అధికారులకు శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహించారు. నియోజకవర్గంలోని బోధన్, ఎడపల్లి, రెంజల్, సాలూర మండలాల ఎన్నికల నిర్వహణలో పాల్గొనే అధికారులకు ఎన్నికల నిర్వహణపై అవగాహన కల్పించారు. పొరపాట్లకు తావులేకుండా పని చేయాలని అధికారులకు సూచించారు. కార్యక్రమంలో బోధన్ సబ్ కలెక్టర్ వికాస్ మహతో, డీఎల్‌పీవో నాగరాజు, బోధన్ ఎంపీడీవో మధుకర్, సంబంధిత శాఖ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

మౌలిక వసతుల కల్పనలో నిర్లక్ష్యం వహించవద్దు

బోధన్,అక్టోబరు6(ఆంధ్రజ్యోతి): ప్రజలకు మౌలిక వసతుల కల్పనలో అధికారులు నిర్లక్ష్యం వహించవద్దని జిల్లా అడిషనల్ కలెక్టర్ అంకిత్ అన్నారు. సోమవారం బోధన్ మున్సిపల్ కార్యాలయంలో పట్టణ అభివృద్ధిపై అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాలు, పట్టణంలో కల్వర్టుల నాణ్యతపై సంబంధిత ఇంజినీర్ అధికారులతో ఆరా తీశారు. సమావేశంలో సబ్ కలెక్టర్ వికాస్ మహతో, మున్సిపల్ కమిషనర్ జాదవ్ కృష్ణ, డీఈ యోగేష్ పాల్గొన్నారు.

ఏకాగ్రతతో ఉత్తమ ఫలితాలు



విద్యార్థులకు వివరిస్తున్న లయన్స్ ప్రతినిధి థామసయ్య

సాలూర,అక్టోబరు6(ఆంధ్రజ్యోతి): ఏకాగ్రతతో ఉత్తమ ఫలితాలు సాధించవచ్చని లయన్స్ ప్రతినిధి థామసయ్య అన్నారు. సోమవారం సాలూర జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులకు లయన్స్ క్లబ్ ఆఫ్ బోధన్ అయ్యప్ప సేవ, లయన్స్ బోధన్ వారు సంయుక్తంగా మెంటల్ వెల్‌నెస్ అనే అంశంపై అవగాహన కల్పించారు. ముఖ్య అతిథిగా ఎంఈవో రాజీ మంజూష హాజరయ్యారు. ఆలోచన విధానం ఏకాగ్రతగా ఉంటే ఎంతటి కార్యానైనా సునాయాసంగా సాధించుకోవచ్చన్నారు. తరగతి గదిలో ఒక విద్యార్థి ఏ విధంగా నడుచుకుంటే లక్ష్యాన్ని సాధించడం సులభతరమవుతుందో విద్యార్థులకు వివరించారు. అనంతరం 9వ తరగతిలో ఫలితాల ప్రతిపాదికన ప్రథమ స్థానంగా నిలిచిన విద్యార్థికి పెన్ను, నగదు ప్రోత్సాహకాన్ని లయన్స్ ప్రతినిధి శ్రీనివాసరావు బహూకరించారు. పాఠశాల ఉపాధ్యాయ బృందం లయన్స్ ప్రతినిధులను సత్కరించారు. కార్యక్రమంలో లయన్స్ ప్రతినిధి ఆదినారాయణ, విద్యార్థులు పాల్గొన్నారు.

స్థానిక సంస్థలు కైవసం చేసుకోవాలి



మాట్లాడుతున్న వినయ్‌రెడ్డి

ఆర్మూర్,అక్టోబరు 6 (ఆంధ్రజ్యోతి):రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో నియోజకవర్గంలో అత్యధిక స్థానాలను కాంగ్రెస్ కైవసం చేసుకోవాలని పార్టీ ఇన్‌చార్జి వినయ్‌రెడ్డి అన్నారు. సోమవారం పట్టణంలో పార్టీ ముఖ్య నాయకులు కార్యకర్తలతో స్థానిక సంస్థల ఎనికలపై సమావేశం నిర్వహించారు. ఒక్కొక్క ఎంపీటీసీ స్థానానికి ముగ్గురు పేర్లను ప్రతిపాదిస్తు జాబితాను రూపొందించాలని సూచించారు. విజయం సాధించే అవకాశం ఉన్నవారికే టికెట్ల కేటాయింపులో ప్రాధాన్యత ఇస్తామన్నారు. కార్యక్రమంలో ఏఎంసీ చైర్మన్ సాయిబాబాగౌడ్, పలు మండలాల అధ్యక్షులు రవి ప్రకాష్, ముక్కెర విజయ్, చిన్నారెడ్డి, భూమేష్‌రెడ్డి, నాయకులు మార చంద్రమోహన్, శ్రీనివాస్‌రెడ్డి, సాయిరెడ్డి, జీవన్, వెంకట్ రాంరెడ్డి, పండిత్ పవన్, వెంకటేష్, అశోక్, భోజారెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

బీజేపీ కార్యకర్తలు సిద్ధంగా ఉండాలి



సమావేశంలో పాల్గొన్న బీజేపీ నేతలు

బోధన్,అక్టోబరు6(ఆంధ్రజ్యోతి): స్థానిక ఎన్నికలకు బీజేపీ నాయకులు, కార్యకర్తలు సిద్ధంగా ఉండాలని పార్టీ మండలాధ్యక్షుడు సిర్ప సుదర్శన్ అన్నారు. సోమవారం పట్టణంలోని పార్టీ కార్యాలయంలో స్థానిక సంస్థల ఎన్నికల సన్నాహక సమావేశం నిర్వహించారు. ప్రతి గ్రామంలో బీజేపీ నాయకులు వార్డు సభ్యులుగా, సర్పంచ్‌గా, ఎంపీటీసీగా ఎన్నికల్లో పోటీ చేస్తారన్నారు. గత ప్రభుత్వాలు చేసిన పరిపాలనను చూసి ప్రజలు విసిగిపోయారని, ఈ సారి బీజేపీ వైపు చూస్తున్నారని పేర్కొన్నారు. కేంద్ర ప్రభుత్వ సంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలన్నారు. బీజేపీ అభ్యర్థుల గెలుపునకు ప్రతి కార్యకర్త కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో వెంకటేష్, లక్ష్మారెడ్డి, మనోహర్, ప్రవీణ్ తదితరులు పాల్గొన్నారు.

సీజేఐపై దాడి అమానుషం



సుప్రీంకోర్టు సీజేఐపై దాడిని ఖండిస్తున్న మాల మహానాడు సభ్యులు

ఆలూర్,అక్టోబరు6(ఆంధ్రజ్యోతి):సుప్రీం కోర్టు సీజేఐ బీఆర్ గవాయ్‌పై లాయర్ దాడి చేయడం సిగ్గు చేటని మాలమహానాడు మండల అధ్యక్షుడు క్రాంతి పేర్కొన్నారు. మండలకేంద్రంలో మాలమహానాడు ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో నిందితుడిని కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో నాయకులు ఉదయ్, శోభన్, జాన్, భాస్కర్, హరీష్, శేఖర్, రంజిత్, రణదీప్, విక్రమ్, వివేక్ పాల్గొన్నారు.

కొండముచ్చుకు అంత్యక్రియలు



అంత్రక్రియలు నిర్వహిస్తున్న దృశ్యం

నవీపేట,అక్టోబరు6(ఆంధ్రజ్యోతి): మద్దెపల్లిలో సోమవారం కొండముచ్చు ప్రమాదవశాత్తు చెట్టుపై నుంచి పడి మృతి చెందింది. స్థానిక యువకులు దానికి అంత్యక్రియలు నిర్వహించారు. సతీష్, భూమేష్, రాజు, సాయిలు తదితరులున్నారు.

ఓటు చోరీకి వ్యతిరేకంగా సంతకాల సేకరణ



కోటగిరిలో సంతకాల సేకరణ కరపత్రాలు ఆవిష్కరిస్తున్న దృశ్యం

కోటగిరి,అక్టోబరు6(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలో కాంగ్రెస్ ఆధ్వర్యంలో ఓట్ చోరీకి వ్యతిరేకంగా సంతకాల సేకరణ చేపట్టారు. సోమవారం మండల కేంద్రంలో కాంగ్రెస్ కార్యకర్తలతో కలిసి ఓట్ చోరీకి వ్యతిరేకంగా కరపత్రాలను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మండల కాంగ్రెస్ అధ్యక్షులు షాహీద్ మాట్లాడుతూ. ఓటర్ల జాబితా నుంచి పేర్లను తొలగించారని ఆరోపించారు. జరిగిందన్నారు. కాంగ్రెస్ ఆదేశాల మేరకు ప్రతి గ్రామంలో ఓట్ చోరీకి వ్యతిరేకంగా సంతకాలను సేకరిస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు మనోహర్, రాజయ్య, ఖదర్, పీ రాజీ, దత్తు పటేల్, ఆనంద్ తదితరులు పాల్గొన్నారు.

ధాన్యం కొనుగోలు కేంద్రాలను సద్వినియోగం చేసుకోవాలి



వర్నిలో కొనుగోలు కేంద్రం ప్రారంభిస్తున్న దృశ్యం

వర్ని, అక్టోబరు 6 (ఆంధ్రజ్యోతి): వర్ని ప్రాథమిక సహకార పరపతి సంఘం పరిధిలోని సత్యనారాయణపురంలో సోమవారం ధాన్యం కొనుగోలు కేంద్రంను జిల్లా సహకార అధికారి ఎన్.శ్రీనివాస్‌రావు ప్రారంభించారు. రైతులు కష్టపడి పండించిన ధాన్యాన్ని దళారులకు విక్రయించి నష్టపోవద్దని ఆయన రైతులకు సూచించారు. నాణ్యత ప్రమాణాలతో కొనుగోలు కేంద్రానికి తీసుకువచ్చి ప్రభుత్వ కొనుగోలు కేంద్రాల్లో విక్రయించి గిట్టుబాటు ధర పొందాలని పేర్కొన్నారు. కార్యక్రమంలో విండో చైర్మన్ నామాల సాయిబాబా, సెక్రటరీ గంగాధర్, రైతులు పాల్గొన్నారు.

నవీపేట,అక్టోబరు6(ఆంధ్రజ్యోతి): బినోల, నిజాంపూర్‌లలో ధాన్యం కొనుగోలు కేంద్రాలను అసిస్టెంట్ రిజిస్ట్రార్, సొసైటీ ప్రత్యేక అధికారి రవీందర్ ప్రారంభించారు. క్వింటా ఏ గ్రేడ్ ధాన్యానికిరూ.2,389, సాధారణ రకానికి రూ.2,36 9 చెల్లిస్తున్నట్లు చెప్పారు. సొసైటీ కార్యదర్శి రమేష్, పలువురు రైతులు పాల్గొన్నారు.

దళారులకు అమ్మి నష్టపోవద్దు

ఎడపల్లి, అక్టోబరు6(ఆంధ్రజ్యోతి): రైతులు తాము పండించిన వరి ధాన్యాన్ని దళారులకు అమ్మి నష్టపోవద్దని ఎడపల్లి తహసీల్దార్ దత్తాత్రి అన్నారు. ఎడపల్లి సహకార సంఘం గోదాముల వద్ద వరి ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని సోమవారం ప్రారంభించారు. కార్యక్రమంలో సహకార సంఘం అధ్యక్షుడు మల్కారెడ్డి, డైరెక్టర్‌లు ప్రవీణ్, సురేష్, కార్యదర్శి రాజారాం, రైతులు పోతన్న, మోహన్, హన్మాండ్లు, శంకర్, కామప్ప, రవీంధర్‌రెడ్డి, నాగేష్ తదితరులు ఉన్నారు.

ఏ గ్రేడ్ రకానికి మద్దతు ధర రూ.2,359

కోటగిరి,అక్టోబరు6(ఆంధ్రజ్యోతి): కోటగిరి ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం ఆధ్వర్యంలో సోమవారం 2 ధాన్యం కొనుగోలు కేంద్రాలను తహసీల్దార్ గంగాధర్ ప్రారంభించారు. ఏ గ్రేడ్ ధాన్యానికి 2,389 రూపాయలు, సాధారణ రకానికి 2,359 రూపాయలు మద్దతు ధర ప్రభుత్వం కల్పిస్తుందన్నారు. కార్యక్రమంలో సహకార సంఘం మానిటరింగ్ అధికారిణి మరియా పుష్ప, ఏఈవో ఆస్మా, విండో కార్యదర్శి విఠల్, రైతులు తదితరులు పాల్గొన్నారు.

● పోతంగల్‌లో..

పోతంగల్ మండల కేంద్రంలో సోమవారం ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని తహసీల్దార్ గంగాధర్ ప్రారంభించారు. కార్యక్రమంలో మండల వ్యవసాయ అధికారిణి నిశిత, రైతులు దిలీప్, లక్ష్మణ్, ఇతర అధికారులు తదితరులు పాల్గొన్నారు.

చివరి గింజ వరకు కొంటాం

కమ్మర్‌పల్లి, అక్టోబరు6:(ఆంధ్రజ్యోతి): కమ్మర్‌పల్లి సహకార సంఘంలో ఏర్పాటుచేసిన వరి ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని తహసీల్దార్ ప్రసాద్ ప్రారంభించారు. నిబంధనల మేరకు ధాన్యం విక్రయించి మద్దతు ధర పొందాలని రైతులకు సూచించారు. చివరి గింజ వరకు ధాన్యం కొనడానికి ప్రభుత్వం సిద్ధంగా ఉందని వెల్లడించారు. కార్యక్రమంలో సహకార సంఘం చైర్మన్ రేగుంట దేవేందర్, డైరెక్టర్‌లు మహేందర్, హరీష్, మండల వ్యవసాయాధికారిణి రమ్యశ్రీ, సతీష్, సంఘం కార్యదర్శి శంకర్ రైతులు పాల్గొన్నారు.

బోధన్,అక్టోబరు6(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ కొనుగోలు కేంద్రాలను సద్వినియోగం చేసుకోవాలని తహసీల్దార్ విఠల్ అన్నారు. సోమవారం బోధన్ మండలంలోని పెంటాకలాన్ సహకార సంఘంలో వరి కొనుగోలు కేంద్రాన్ని తహసీల్దార్ విఠల్ ప్రారంభించారు. రైతుల సంక్షేమం కోసం ప్రభుత్వం కేంద్రాలను ప్రారంభించిందని, రైతులు కుండా ప్రభుత్వ కొనుగోలు కేంద్రాల్లోనే విక్రయించాలన్నారు. ఎటువంటి ఇబ్బందులున్న తమ దృష్టికి తీసుకురావాలన్నారు. కార్యక్రమంలో ఆర్ఐ గంగాదర్, సొసైటీ సీఈవో షేక్ బాబా, రైతులు పాల్గొన్నారు.



పెంటాకలాన్‌లో కొనుగోలుకేంద్రాన్ని ప్రారంభిస్తున్న దృశ్యం

చికిత్స పొందుతూ మహిళ మృతి

బోధన్, అక్టోబరు 6 (ఆంధ్రజ్యోతి): మినార్‌పల్లితండాకు చెందిన పద్మ(44) జిల్లాకేంద్రంలో చికిత్స పొందుతూ మృతి చెందినట్లు బోధన్ రూరల్ ఎస్సై మచ్చేందర్‌రెడ్డి తెలిపారు. గత నెల 29న గడ్డిమందు తాగి ఆత్మహత్యకు యత్నించడగా.. సోమవారం ఉదయం మరణించింది. ఏడాది కిందట భర్త మృతి చెందడంతో మనస్తాపానికి గురై ఆత్మహత్యాయత్నానికి పాల్పడినట్లు ఎస్సై తెలిపారు.

నిందితుడికి రిమాండ్

ఎడపల్లి, అక్టోబరు 6(ఆంధ్రజ్యోతి): జైతాపూర్ శివారులో దొరికిన శీలంవార్ లింగవ్వ మృతికి కారణమైన బాలకృష్ణను రిమాండుకు తరలించినట్లు ఎస్సై రమ తెలిపారు. మహారాష్ట్ర కొండల్‌వాడీకి చెందిన లింగవ్వ గతనెల 28న మండలంలోని పోచారం గ్రామానికి బయలుదేరినా రాకపోవడంతో జలంలో ఉండే తన కూతురు సురేఖ ఈనెల 2న పోలీసులకు ఫిర్యాదు చేయడంతో మిస్సింగ్ కేసు నమోదు చేశారు. మరుసటి రోజు జైతాపూర్‌కు చెందిన పురిమేటి బాలకృష్ణ ఆటోలో శవాన్ని తీసుకు వెళ్తూ గ్రామస్థులను చూసి పారిపోయాడని, సోమవారం రోజున అతడిని పట్టుకుని విచారించినట్లు చెప్పారు. కాగా.. లింగవ్వను తనే హత్య చేసినట్లు ఒప్పుకోవడంతో రిమాండుకు తరలించినట్లు ఎస్సై తెలిపారు.

రైతులకు సబ్సిడీ టార్పాలిన్ల అందజేత

భీమ్‌గల్, అక్టోబరు 6(ఆంధ్రజ్యోతి): రైతులకు కేంద్ర ప్రభుత్వం నుంచి మంజూరైన సబ్సిడీ టార్పాలిన్లను బీజేపీ రాష్ట్ర కౌన్సిల్ మెంబర్ యోగేశ్వర్, నర్సయ్య ఆధ్వర్యంలో అందజేశారు. వ్యవసాయ రంగానికి అవసరయ్యే టార్పాలిన్లు 2వేల 700 రూపాయలు ఉండగా కేంద్ర ప్రభుత్వం 50 శాతం సబ్సిడీ 1350 రూపాయలకు అందిస్తుం దని వారు తెలిపారు. దీనిని రైతులందరూ సద్వినియోగం చేసుకోవాలని నర్సయ్య ఈ సందర్భంగా తెలిపారు. సోమవారం 500 టార్పాలిన్లు రైతులకు అందజేసినట్లు ఆయన వివరించారు. రైతులు ప్రభుత్వ పథకాలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో కిసాన్ మోర్చా అధ్యక్షుడు గంగాదర్, రైతులు భూమేష్, రవి, పాల్గొన్నారు.

గెలుపు గుర్రాలే ఎన్నికల బరిలోకి..



సమావేశంలో మాటాడుతున్న బద్ద రమేష్‌రెడ్డి

కమ్మర్‌పల్లి, అక్టోబరు 6: (ఆంధ్రజ్యోతి): ఆశావహులు ఎందరున్నా పార్టీ అధిష్టానం గెలుపుగుర్రాలనే ఎన్నికల బరిలో దింపుతుందని, వారినే మెజార్టీతో గెలిపించుకునే బాధ్యత ప్రతీ కార్యకర్తపై ఉంటుందని బీజేపీ మండల అధ్యక్షుడు బద్దం రమేష్‌రెడ్డి అన్నారు. సోమవారం మండలంలోని హసాకొత్తూర్ శివారులోని జగదంబాదేవి (శుక్రవారం దేవి) ఆలయప్రాంగణంలో బీజేపీ మండల కార్యకర్తల సన్నాహక సమావేశం నిర్వహించారు. కార్యకర్తల కృషితోనే బీజేపీ అభ్యర్థుల గెలుపు సాధ్యమని పేర్కొన్నారు. ప్రతి ఒక్కరూ సమష్టిగా కృషి చేయాలని పిలుపునిచ్చారు. కేంద్ర ప్రభుత్వ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని పేర్కొన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం వైఫల్యాలను ఎండగట్టాలని ప్రజలకు వివరించాలని, బీఆర్ఎస్ అక్రమాలు చెప్పి బీజేపీ ఓట్లేయాలని కోరాలని సూచించారు. ప్రతి కార్యకర్త అప్రమత్తంగా ఉంటూ ప్రత్యర్థులతో ఎన్నికల్లో పోరాడాలన్నారు. కార్యక్రమంలో బీజేపీ సీనియర్ నాయకులు మోహన్, సతీష్, నరేష్, మోహన్, సంతోష్ రెడ్డి, గంగాధర్, లింగరెడ్డి, మల్లేష్ యాదవ్, బలరాం, ప్రవీన్, నవీన్ తదితరులు పాల్గొన్నారు.

పొంగిపొర్లుతున్న నల్లవాగు మత్తడి

- మంజీరా నదిలోకి ఉరకలు
- కొనసాగుతున్న వీఆర్ నెంబర్ ఐదులోని ఐదు వరద గేట్లు
- నిజాంసాగర్ ఎగువ నుంచి 32 వేల 820 క్యూసెక్కుల వరద నీరు రాక



మంజీరా నదిలోనికి ఉరకలు వేస్తున్న నల్లవాగు మత్తడి వరద నీరు

నిజాంసాగర్, అక్టోబరు 6 (ఆంధ్రజ్యోతి): నల్లవాగు ఎగువ ప్రాంతంలో సోమవారం కురిసిన భారీ వర్షాలకు నిజాం సాగర్ నాన్ కమాండ్ ఏరియాలోని నల్లవాగు మత్తడి పొంగిపొర్లు పోయింది. దాదాపు 50 వేల క్యూసెక్కుల వరద నీరు మంజీరా నదిలోనికి ఉరకలు వేస్తూ ఉంది. ఆదివారం సోమవారం కురిసిన వర్షాలకు సంగారెడ్డి జిల్లా సిర్గాపూర్ మండలంలోని నల్లవాగు ప్రాజెక్టు పొంగిపొర్లు తోనే ఉంది. మంజీరా ఉపనది వెంటనే భారీ వరద నీరు నల్లవాగు మత్తడిలోనికి ఉరకలు వేస్తూ రావడంతో నల్ల మత్తడి పొంగిపొర్లుతూ ఉంది. ఈ మత్తడి గత నెల రోజులుగా అతి స్వల్పంగా పొర్లుతూనే ఉంది. సోమవారం భారీ వరద నీరు రావటంతో రహదారి వంతెనకు తగులుతూ మంజీరా నదిలోనికి ప్రవహించడం ఇదే ప్రథమం నిజాంసాగర్ ప్రాజెక్టులోనికి ఎగువ ప్రాంతం నుంచి 32 వేల 820 క్యూసెక్కుల వరద నీరు వచ్చి చేరుతుంది. దీంతో నీటిపారుదల శాఖ అధికారులు నిజాంసాగర్ వరద గేట్లను ఐదింటిని కొనసాగిస్తూ ఎగువ నుంచి వచ్చే నీటిని దిగువకు వదులుతూ ఉన్నారు. నిజాంసాగర్ ప్రాజెక్టు నీటిమట్టాన్ని పూర్తిస్థాయిలో నిలువ చేస్తూనే ఉన్నారు. నిజాంసాగర్ వరద గేట్ల ద్వారా విడుదల చేస్తున్న నీటితో పాటు నల్లవాగు మత్తడి పొంగిపొర్లుతూ ఉండడంతో దాదాపు 80 వేల క్యూసెక్కుల నీరు మంజీరా నదిలో పరవాళ్ళు తొక్కుతూ ఉంది.

వరద బాధితులను ఒడ్డుకు చేర్చిన అధికారులు



వరదలో చిక్కుకున్న వ్యక్తిని కాపాడిన ఫైర్ సిబ్బంది

పిట్లం అక్టోబరు 6 (ఆంధ్రజ్యోతి): ఆదివారం రాత్రి కురిసిన భారీ వర్షానికి తిమ్మానగర్ వద్ద గల కాకివాగు వరద ఉధృతి అకస్మాత్తుగా రావడంతో కల్వెర్ వాగులో చిక్కుకున్న సైమల్ పక్రియను తహసీల్దార్ రాజా నరేందర్‌గౌడ్, సీఐ తిరుపతయ్య, ఫైర్ సిబ్బంది అక్కడికి చేరుకొని వ్యక్తిని సురక్షితంగా రక్షించారు. రాత్రి కురిసిన భారీ వర్షాలకు కాకివాగు వరద ఉధృతిగా పొంగిపొర్లడం జరిగింది. కాకివాగు వరదలో కల్వెర్ సమీపాన రైతు చిక్కుకున్నారని సమాచారం సోమవారం తహశీల్దార్ రాజా నరేందర్‌గౌడ్, సీఐ తెలువగానె ఫైర్ సిబ్బందితో కలిసి వాగు వద్దకు చెరుకొని వ్యక్తిని కాపాడినారు. రైతు సైమల్ పక్రియ ఎప్ప టి మాదిరిగానె పొలం వద్దకు వెళ్లగా వరదలో చిక్కుకోవడం జరిగిందని అధికారులు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎస్సై వెంకట్‌రావు, ఆర్ఐ శీతల్ ఉన్నారు.

మద్యం టెండర్లకు 'కోడ్' అడ్డంకి

- వ్యాపారుల్లో 'డబ్బు' గుబులు
- రూ.50వేల కంటే ఎక్కువ ఉంటే సీజ్ భయం



ఎక్సైజ్ కార్యాలయం

సుభాష్‌నగర్, అక్టోబరు 6 (ఆంధ్రజ్యోతి): స్థానిక సంస్థల ఎన్నికల కోడ్ కూయడంతో మద్యం దరఖాస్తుదారుల్లో గుబులు నెలకొంది. రూ.50వేల కంటే ఎక్కువ తీసుకువెళ్లరాదని ఎన్నికల నియమావళి ఉండటంతో మద్యం దరఖాస్తుదారులకు ఇబ్బందిగా మారింది. ఒక్క మద్యం దరఖాస్తుకు రూ.3లక్షలు చెల్లించాల్సి రావడంతో ఇబ్బందిగా మారింది. ఒక్కొక్కరు ఒకటి కంటే ఎక్కువ మద్యం దుకాణాలకు టెండర్లు దాఖలు చేస్తున్నారు. దీంతో లక్షల్లో డబ్బులను తీసుకురావాల్సి ఉంటుంది. జిల్లాలో 102 మద్యం షాపులకు మందకొడిగా దరఖాస్తులు నమోదు అవుతున్నాయి. సెప్టెంబరు 26 నుంచి అక్టోబరు 6వ తేదీ వరకు కేవలం 35 మద్యం దుకాణాలకు టెండర్లు దాఖలు చేశారు. ఇప్పటికీ అధికారులు ఎన్నికల కోడ్‌ను పక్కాగా అమలు చేయకపోవడంతో ఇబ్బంది జరగలేదు.

ముందుగానే చాలన్ తీసుకోవాలి..

మద్యం దుకాణాల కోసం దరఖాస్తులు వేసే వారు ఎక్సైజ్ శాఖ నుంచి ముందే చాలన్‌ను తీసుకోవాలి. ముందుగా చాలన్ తీసుకున్న వారు డబ్బులను తీసుకొని చాలన్‌ను బ్యాంకులో వేసుకోవాలి. చాలన్ ఉంటే డబ్బులను సీజ్ చేయరని ఎక్సైజ్ అధికారులు చెబుతున్నారు. ఆదివారం వరకు 25 దరఖాస్తులు నమోదు కాగా సోమవారం 10 దరఖాస్తులు నమోదు కావడంతో మొత్తంగా 35 దరఖాస్తులు నమోదయ్యాయి. నిజామాబాద్ ఎక్సైజ్ స్టేషన్ పరిధిలో మొత్తం 36 మద్యం దుకాణాలకు గాను 11 మద్యం దుకాణాలకు 11 దరఖాస్తులు నమోదయ్యాయి. బోధన్ స్టేషన్ పరిధిలో 18 మద్యం దుకాణాలకు గాను 4 మద్యం దుకాణాలకు 5 దరఖాస్తులు నమోదు అయ్యాయి. ఆర్మూర్ స్టేషన్ పరిధిలో మొత్తం 25 మద్యం దుకాణాలకు గాను 4 షాపులకు 5 దరఖాస్తులు వచ్చాయి. భీంగల్ స్టేషన్ పరిధిలో మొత్తం 12 మద్యం దుకాణాలకు గాను 3 మద్యం దుకాణాలకు 4 దరఖాస్తులు నమోదు అయ్యాయి. మోర్తాడ్ స్టేషన్ పరిధిలో మొత్తం 11 మద్యం దుకాణాలకు గాను 2 మద్యం దుకాణాలకు 3 దరఖాస్తులు అందినట్లు ఎక్సైజ్ సూపరింటెండెంట్ మల్లారెడ్డి తెలిపారు. సోమవారం వరకు జిల్లాలోని 102 మద్యం దుకాణాలకు గాను 24 మద్యం దుకాణాలకు 35 దరఖాస్తులు అందినట్లు తెలిపారు.

అభివృద్ధిని చూసి ఓర్వలేకే ఆరోపణలు

● కాంగ్రెస్ పార్టీ మండల ప్రధాన కార్యదర్శి దివిటి కిష్టయ్య

నాగిరెడ్డిపేట, అక్టోబరు 6 (ఆంధ్రజ్యోతి): ఎల్లారెడ్డి నియోజకవర్గంలో ఎమ్మెల్యే మదన్ మోహన్ రావు చేస్తున్న అభివృద్ధిని చూసి ఓర్వలేకే బీఆర్ఎస్ పార్టీ నేతలు తప్పుడు ఆరోపణలు చేస్తున్నారని కాంగ్రెస్ పార్టీ మండల నాయకులు ఆరోపించారు. సోమవారం మండల కేంద్రంలో మండల కాంగ్రెస్ నాయకులతో కలిసి మండల కాంగ్రెస్ ప్రధానకార్యదర్శి దివిటి కిష్టయ్య, కాంగ్రెస్ మండల నాయకులు మాట్లాడుతూ బీఆర్ఎస్ ప్రభుత్వం 10ఏళ్ల అధికారంలో ఉండగా భారీ వర్షాల కారణంగా మంజీరా వరద నీటి వల్ల మండలం లోని వివిధ గ్రామాల్లో పంటలు నీట మునిగి రైతులకు పంట నష్టం జరిగినా బీఆర్ఎస్ ప్రభుత్వం రైతులకు ఎలాంటి నష్టపరిహారం అందించ లేదని, రైతులను ఆదుకోలేదని ఆరోపించారు. ఈ కార్య క్రమంలో మండల కాంగ్రెస్ నాయకులు సం జీవులు, ఇమామ్, సాయగౌడ్, శివ కుమార్, గంపల వెంకయ్య, షాహిద్ పాషా, బండ బాబు, రవీందర్ రెడ్డి, విఠల్ పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో కోజాగిర పూర్ణిమ

మద్నూర్, అక్టోబరు 6 (ఆంధ్రజ్యోతి): ఉమ్మడి మద్నూర్ మండలంలో కోజాగిర పూర్ణిమను భక్తులు సోమవారం అర్ధరాత్రి భక్తిశ్రద్ధలతో జరుపుకున్నారు. శరత్ ఋతువులో అశ్వయుజ పౌర్ణమి రోజున కోజాగిర పూర్ణిమను పండుగగా జరుపుకోవడం అనాధిగా వస్తుంది. కోజాగిర పూర్ణిమ రోజు రాత్రివేళ లక్ష్మీదేవి ఆకాశ మార్గంలో విహరిస్తూ ఎవరైతే జాగరణ, ఉపవాసం పాటిస్తూ తనను పూజిస్తారో వారికి అష్టైశ్వర్యాలు ప్రసాదిస్తుందని భక్తులు విశ్వసిస్తారు. సోమవారం అర్ధరాత్రి వేళ ఆలయాలలో, ఇళ్లల్లో, నది తీర ప్రాంతాల్లో పాలల్లో చంద్రుడిని చూసి ఆ పాలను ప్రసాదంగా స్వీకరించారు.

చేతికొచ్చిన పంట నీటిపాలు



మద్నూర్ మార్కెట్ యార్డులో తడిసిన సోయా పంట



తడిసి ముద్దయిన సోయా

- కన్నీళ్లు పెట్టుకుంటున్న ఉమ్మడి మద్నూర్ మండల రైతులు
- రైతులకు తప్పని తిప్పలు

మద్నూర్, అక్టోబరు 6 (ఆంధ్రజ్యోతి): చేతికొచ్చిన సోయా పంట అకాల వర్షాలతో నీటిపాలు చేసింది. గత నెలలో కురిసిన వర్షంతో వేలాది ఎకరాలలో సోయా పంట నష్టపోగా ఇటీవల చేతికొచ్చిన పంట మద్నూర్ మార్కెట్ యార్డులో ఆరబోసుకోగా రాత్రి కురిసిన వర్షం రైతుల కష్టాన్ని నేలపాలు చేసింది. మద్నూర్ మండలంలో రైతులు వర్షాధారం పైనే ఆధారపడి పంటలు పండిస్తారు. ఉమ్మడి మద్నూర్ మండలానికి ఎటువంటి నీటి వనరులు లేకపోవడంతో అత్యధికంగా వర్షాలు కురిసిన అతి స్వల్ప వర్షాలు కురిసిన నష్టపోవాల్సింది రైతులే. ఇటీవల రెండు నెలల క్రితం ఉమ్మడి మండలంలో భారీ వర్షాలతో వరదలు వచ్చి చేలల్లో నీళ్లుచేరి సోయా పంట నష్టపోయింది. మిగిలిన పంట కోసుకొచ్చి మద్నూర్ మార్కెట్ యార్డులో ఆరబోసుకుంటే అది సైతం రాత్రి కురిసిన వర్షానికి తడిసి ముద్దయింది. దీంతో రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. రైతులు ఆరుగాలం కష్టపడి పండించిన పంటను విక్రయించడానికి వెళ్తే వ్యాపారస్తులు తేమ శాతం ఎక్కువగా ఉందంటూ సోయా పంటను కొనుగోలు చేయడం లేదు. దీంతో రైతులు మద్నూర్ మార్కెట్ యార్డులోనే సోయా పంటను ఆరబోస్తున్నారు. దీపావళి సోయా పంటను అమ్మిన డబ్బులు వస్తాయని ఆశించిన రైతులకు నిరాశే మిగిలింది. ఆరబోసిన పంట నీళ్ల పాలు కావడంతో ఏం చేయాలో దిక్కు తోచని స్థితిలో మండల రైతులు ఆందోళన చెందుతున్నారు. మార్కెట్లో సోయా కొనుగోలు కేంద్రం ఏర్పాటు చేసి రైతుల పంటలు కొనుగోలు చేయాలని కోరుతున్నారు. ఈ పాటికి 90 శాతం సోయా పంట మార్కెట్ యార్డుకు వచ్చింది. అధికారుల నిర్లక్ష్యం వహిస్తూ కొనుగోళ్లలో ఆలస్యం చేస్తున్నారని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. రైతులు సోయా పంటను అక్కడే ఆరబోసి కాపలా కాస్తున్నారు. రాత్రింబగలు అక్కడే పడుకుంటు కాపలాకాసి చివరికి పంట వర్షార్పణం కావడంతో కన్నీరు పెడుతున్నారు. ఎన్నో ఆశలతో వేసిన సోయా పంట ఎకరానికి మూడు నుంచి నాలుగు క్వింటాళ్లు మాత్రమే దిగుబడి రావడంతో నష్టపోతున్నామని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఎకరానికి 10 క్వింటాళ్ల సోయా వచ్చేదని అటువంటిది అత్యధిక వర్షంతో పంటలు నష్టపోయి సోయా దిగుబడి తగ్గిపోయిందని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఉన్న కొద్ది సోయా కోసుకొచ్చి ఆరబెట్టుకుంటే అకాల వర్షంతో కొట్టుకుపోవడంతో రైతులు కన్నీళ్లు పెట్టుకుంటున్నారు.

● 12 ఎకరాలలో సోయా వేశాను



12 ఎకరాలలో ఈ ఏడాది సోయా పంట సాగు చేశాను. గత రెండు నెలలపాటు కురిసిన అకాల వర్షాలతో వరదలు వచ్చి పంటలు నష్టపోగా ఇటీవల మార్కెట్ యార్డులో ఆరబోసిన పంట సైతం రాత్రి వర్షానికి కొట్టుకుపోవడంతో ఎన్నో ఆశలతో వేసిన సోయా చేతికి రాలేదు. దీపావళి పండుగకు పెట్టుబడి వస్తుందని ఆశించిన నిరాశే ఎదురైంది.

- అనిల్, రైతు

● పెట్టుబడి వచ్చేటట్టు లేదు?



ఈసారి సోయాకు పెట్టుబడి పెట్టిన డబ్బులు వచ్చేటట్లు లేవు. ఎకరానికి ఐదు నుంచి ఆరు వేల రూపాయల చొప్పున పెట్టుబడి పెట్టి ఎనిమిది ఎకరాలు సోయా పంట సాగు చేశాను. వర్షానికి నష్ట పోగా దిగుబడి తగ్గిపోవడంతో పెట్టుబడి సైతం రావడం లేదు. ఉన్న పంట ప్రభుత్వం కొనుగోలు కేంద్రం ప్రారంభిస్తే విక్రయించడానికి సిద్ధంగా ఉన్నాము.

- అంజయ్య, రైతు

పాఠశాల భవన నిర్మాణం పూర్తయ్యేలా చూడాలి



మాట్లాడుతున్న అక్బర్

బాన్సువాడ టౌన్, అక్టోబరు 6 (ఆంధ్రజ్యోతి): బాన్సువాడ పట్టణం లోని వీక్లీ మార్కెట్, ఫిర్దౌస్ కాలనీ ప్రాథమిక పాఠశాల భవన నిర్మాణం పూర్తయ్యేలా చూడాలని మాజీ వార్డు సభ్యుడు అక్బర్ సోమవారం సబ్ కలెక్టర్ కార్యాలయంలో వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన విలేకరులతో మాట్లాడుతూ ప్రస్తుతం ఒకే చోట మూడు పాఠశాలలు కొనసాగుతున్నాయని, విద్యార్థులు నానా అవస్థలు పడుతున్నారన్నారు. నిధులు మంజూరైనా కాంట్రాక్టర్ నిర్లక్ష్యం వల్లే భవన నిర్మాణంలో జాప్యం జరుగుతుందన్నారు. అధికారులు స్పందించి తక్షణమే భవన నిర్మాణం జరిగేలా చర్యలు తీసుకుని, విద్యార్థులకు న్యాయం చేయాలని డిమాండ్ చేశారు.

మద్యం షాపును తొలగించాలి

నాగిరెడ్డిపేట, అక్టోబరు 6 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని గోపాల్‌పేట్ గ్రామంలో గ్రామం మధ్యన కొనసాగుతున్న మద్యం దుకాణాన్ని అక్కడి నుంచి తొలగించాలని కోరుతూ గ్రామస్థులు సోమవారం తహశీల్దార్ శ్రీనివాస్ రావుకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మండల కేంద్రంలోని చీనూర్ గ్రామానికి వెళ్లే దారిలో నివాస గృహాల మధ్యన మద్యం దుకాణం కొనసాగుతున్నందున గ్రామస్థులకు తీవ్ర ఇబ్బందులు ఎదురవు తున్నాయని వారు తెలిపారు పర్మిట్ రూంలో మద్యం ప్రియులు నిత్యం మద్యం తాగి నివాస గృహాల సమీపంలోనే మూత్ర విసర్జన చేస్తుండడంతో దుర్వాసన భరించలేక ఇబ్బందులు పడుతున్నామన్నారు. సాయంత్రం వేళ పొలం పనులు ముగించుకొని ఇళ్లకు చేరుకుంటున్న సమయంలో మద్యం ప్రియులు మహిళలకు, వృద్ధులకు దారి ఇవ్వకుండా తీవ్ర ఇబ్బందులు కలుగజేస్తున్నారని తెలిపారు. ఈ కార్యక్రమంలో గ్రామస్థులు ఎండీ ఫరీద్, హన్మంత్ రెడ్డి, మశ్చేందర్ గౌడ్, లక్ష్మీ కాంతం, సాయిలు, సంగమేశ్వర్, సాజిద్, భూమయ్య, రాజు తదితరులు పాల్గొన్నారు.

గెలుపు గుర్రాలపై పార్టీల నజర్

- రసవత్తరం కానున్న స్థానిక ఎన్నికలు
- గ్రామాల్లో జోరుగా చర్చ

ఎల్లారెడ్డి, అక్టోబరు 6 (ఆంధ్రజ్యోతి): గ్రామాల్లో ఎక్కడ చూసినా స్థానిక సంస్థల ఎన్నికల గురించే ప్రధానంగా చర్చ జోరుగా సాగుతుంది. స్థానిక సంస్థల ఎన్నికలకు నోటిఫికేషన్ మార్గదర్శకాలు విడుదల కావడంతో ప్రధాన పార్టీలన్నీ గెలుపు గుర్రాలపై ప్రత్యేక దృష్టి సారిస్తున్నాయి. ప్రజల మద్దతు ఉంటే విజయం సాధించే అవకాశం ఉందా అభ్యర్థులపై ప్రధాన పార్టీలు ఫోకస్ పెట్టాయి. ఈ క్రమంలో ఎల్లారెడ్డి మండలంలో ఓ నాయకుడిని ప్రధాన పార్టీలు ఎలాగైనా తమ పార్టీలో చేరాలని ఒత్తిడి పెంచుతున్నట్లు తెలుస్తోంది. ప్రధాన పార్టీల నేతలు వర్గంతో ప్రయత్నాలు చేస్తున్నట్లు సమాచారం.

● గతానికి భిన్నంగా..

గతంలో ముందుగా ఒక నోటిఫికేషన్ జారీ అయ్యేది. అయితే ఎంపీటీసీ ఎన్నికలు లేదా సర్పంచ్ వార్డు సభ్యుల ఎన్నికల్లో ఏదో ఒకటి ముందు జరిగేవి. ఇలా జరగడం మూలంగా ముందుగా వచ్చిన ఎన్నికల్లో పోటీ చేసిన అభ్యర్థులు ఆ ఎన్నికల్లో నుంచి ఓట్లు సాధించి దరిదాపుల్లోకి వచ్చి ఓడిపోయిన వారు. మరోసారి వెంటనే వచ్చే స్థానిక ఎన్నికల్లో పోటీ చేసి గెలిచే అవకాశం ఎక్కువగా ఉండేది. కానీ ఈసారి సానుభూతికి అవకాశం లేకుండానే నేరుగా ముందుగా ఎంపీటీసీ, జడ్పీటీసీ ఎన్నికలు ఆ వెంటనే సర్పంచ్ ఎన్నికలు నిర్వహించనున్నారు. ఫలితంగా ఎన్నికల బరిలో నిలిచే అభ్యర్థులు సానుభూతిని మూట గట్టుకునే ఛాన్స్ లేకుండా పోయింది. రెండు ఎన్నికల్లో పోటీ చేసి అదృష్టాన్ని పరీక్షించుకోవాల్సిన పరిస్థితి నెలకొంది. రెండింటికి పోటీ చేస్తే నెగిటివ్ ఫలితాలు వస్తాయని కొందరు భావిస్తున్నారు.

● మొదటి ఎన్నికల్లో ఓడి.. రెండో ఎన్నికల్లో గెలిచే అవకాశాలు ఈ సారి లేవు

గతంలో చాలామంది అభ్యర్థులు సర్పంచ్ పదవికి ఓడిపోయి. మళ్లీ ఎంపీటీసీ ఎన్నికల్లో గెలిచారు. ముందుగా ఎంపీటీసీగా ఓడిపోయి సర్పంచ్‌గా గెలిచారు. ఆ తర్వాత సర్పంచిగా గెలిచిన ఘటనలు ఉన్నాయి. ఈసారి ఆ అవకాశం లేకుండా పోయింది. ఏది ఏమైనా ఈసారి స్థానిక సంస్థల ఎన్నికలు రసవత్తరంగా సాగనుంది.

ఫసల్ బీమా అమలు కాక రైతులకు నష్టం

● బీజేపీ జిల్లా ఉపాధ్యక్షుడు రాజ్ మోహన్ రెడ్డి



మాట్లాడుతున్న జిల్లా బీజేపీ ఉపాధ్యక్షుడు రాజ్‌మోహన్ రెడ్డి

నాగిరెడ్డిపేట, అక్టోబరు 6 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో ప్రభుత్వం రైతుల కోసం ఫసల్ బీమా పథకం అమలు చేయకపోవడంతోనే ఇటీవల కురిసిన భారీ వర్షాలతో, వరదలతో పంటలు నష్టపోయిన రైతులకు తీవ్ర అన్యాయం జరిగి నష్టం వాటిల్లిందని బీజేపీ జిల్లా ఉపాధ్యక్షుడు రాజ్ మోహన్ రెడ్డి ఆరోపించారు. ఆయన సోమవారం మండల కేంద్రంలో విలేకరుల సమావేశంలో మాట్లాడారు. భారీ వర్షాల కారణంగా నాగిరెడ్డిపేట మండలంలో మంజీరా వరద నీటి వల్ల అత్యాధిక శాతం వరి పంటలు వరద నీటిలో ముంపునకు గురయ్యాయన్నారు. మంజీరా వరద నీటిలో మండలంలోని వివిధ గ్రామాల్లోని పంటలు నెల రోజులకుపైగా నీట మునిగి ఉండటంతో వేలాది ఎకరాల్లో పంటలు నష్టపోయినట్టు, రైతులకు తీవ్ర నష్టం వాటిలిందని ఆయన తెలిపారు. ప్రభుత్వం రైతులకు ఫసల్ బీమా అమలు చేసి ఉంటే మండలంలో వరదలతో ముంపుకు గురై పంటలు నష్టపోయిన రైతులకు భీమా సౌకర్యం ద్వారా మేలు జరిగేదన్నారు. మండలంలో పంటలు నష్టపోయిన రైతులందరికీ ప్రభుత్వం నష్టపరిహారం చెల్లించి ఆదుకోవాలని ఆయన కోరారు. ప్రస్తుతం గ్రామాల్లో కేంద్ర ప్రభుత్వం నిధుల ద్వారానే వివిధ అభివృద్ధి పనులు కొనసాగుతున్నాయన్నారు. కామారెడ్డి జిల్లాలో బీజేపీ అన్ని మండలాల్లో గ్రామ, గ్రామాన పటిష్టంగా ఉందని, స్థానిక సంస్థల ఎన్నికల్లో జిల్లాలో జడ్పీటీసీ, ఎంపీటీసీ, సర్పంచుల అత్యధిక స్థానాలు గెలుపొందెందుకు తీవ్ర కృషి చేస్తున్నట్టు తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా బీజేపీ కార్యవర్గ సభ్యుడు హన్మాండ్లు, మండల పార్టీ అధ్యక్షుడు శ్రీనివాస్, ప్రధాన కార్యదర్శి కిషన్, మండల పార్టీ మాజీ అధ్యక్షుడు శ్రీకాంత్, మండల ఎస్టీ విభాగం అధ్యక్షుడు దేవి సింగ్ తదితరులు పాల్గొన్నారు.

ఓటు చోరీకి వ్యతిరేకంగా సంతకాల సేకరణ చేపట్టాలి

బీర్కూర్, అక్టోబరు 6 (ఆంధ్రజ్యోతి): సామాజిక న్యాయం కోసం ఓటు చోరీకి వ్యతిరేకంగా రాహుల్ గాంధీ చేపడుతున్న పోరాటానికి ప్రతిఒక్కరూ అండగా నిలవాలని బీర్కూర్ మండల కాంగ్రెస్ పార్టీ నాయకులు పిలుపునిచ్చారు. సోమవారం బీర్కూర్ మండల కేంద్రంలో ఓటు చోరీకి వ్యతిరేకంగా కాంగ్రెస్ పార్టీ నాయకులు ప్రజల నుంచి సంతకాలు సేకరించారు. ఈ సందర్భంగా మండల అధ్యక్షుడు శంకర్ మాట్లాడుతూ రాష్ట్ర కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు మహేష్ కుమార్ గౌడ్ ఆదేశాల మేరకు సంతకాల సేకరణ కార్యక్రమాన్ని చేపడుతున్నామన్నారు. ప్రతీ గ్రామంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు కార్యకర్తలు సంతకాలు సేకరించాలన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు, బసవరాజు పటేల్, రఘు, ఇంగు రాములు, కాంత్‌రెడ్డి, దొంతూరం కాశీరాం, సందీప్, ఆరిఫ్, రఫీ, లయక్, నరసింహారావు, తోట ప్రభాకర్, మారుతి రెడ్డి, వెంకన్న పాల్గొన్నారు.

పునఃప్రారంభం కానీ కేజీబీవీ



మద్నూర్ కేజీబీవీకి వచ్చిన విద్యార్థినులు, తల్లిదండ్రులు

మద్నూర్, అక్టోబరు 6 (ఆంధ్రజ్యోతి) : దసరా సెలవుల తర్వాత సోమవారం పునఃప్రారంభం కావాల్సిన కస్తూర్బా బాలికల విద్యాలయం ప్రారంభించక పోవడంతో దూర ప్రాంతాల నుంచి వచ్చిన విద్యార్థినులు, వారి తల్లిదండ్రులు ఇ బ్బందులు పడ్డారు. రాష్ట్ర ప్రభుత్వం దసరా సెలవుల కోసం విద్యార్థులకు సెలవులు ప్రకటించి పాఠశాలలను మూసివేశారు. తిరిగి సోమవారం నుంచి పున ప్రారంభించాలని ఆదేశాలు జారీ చేసింది. కానీ మద్నూర్ మండల కేంద్రంలోని కేజీబీవీ బాలికల విద్యాలయం సోమవారం తెరచు కోలేదు. దీంతో దూర ప్రాంతాల నుంచి పాఠశాలల్లో చదువుకునే విద్యార్థినిలు మండల కేంద్రానికి వచ్చి తిరిగి వెళ్ళిపోవాల్సిన పరిస్థితి ఏర్పడింది. ఈ విషయమై కస్తూర్బా గురుకుల పాఠశాల ప్రిన్సిపాల్ సత్యశీలను ఆంధ్రజ్యోతి వివరణ కోరగా గురుకుల పాఠశాలలో మరుగుదొడ్లలో టైల్స్ పనులు జరుగుతున్నందున సోమవారం పాఠశాలను ప్రారంభించలేదని తెలిపారు. వచ్చిన విద్యార్థులు తనకు ఫోన్ చేసినట్లయితే వారికి పాఠశాలలో ఉండే విధంగా ఏర్పాట్లు చేసేందుకు ఏర్పాటు చేసినట్లు వెల్లడించారు. 7న మంగళవారం సాయంత్రం వరకు విద్యార్థినులు రావాలని వారికి సమాచారం ఇచ్చామని పేర్కొన్నారు.

స్థానిక ఎన్నికలలో విజయం సాధించాలి



బీజేపీ కార్యకర్తల సమావేశంలో మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే అరుణతార

పిట్లం, అక్టోబరు 6 (ఆంధ్రజ్యోతి): రానున్న స్థానిక ఎంపీటీసీ, జట్పీటీసీ, సర్పంచ్ ఎన్ని కలలో బీజేపీ అన్ని స్థానాలలో అభ్యర్థులను నిబెట్టడం జరుగుతుందని జుక్కల్ మాజీ ఎమ్మెల్యే అరుణతార అన్నారు. సోమవారం పిట్లంలో మండల బిజెపి మండల కార్యకర్తల సమావేశం నిర్వహించారు. ముఖ్యఅతితిగా మాజీ ఎమ్మెల్యే హా జరయ్యారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ రానున్న ఎంపిటిసి, జడ్పీటీసీ, సర్పంచ్ ఎన్నికలలో బీజేపీ విజయం సాదిస్తుందని తెలిపారు.కార్యకర్తలు అందరు ఏకంగా ఉండి పార్టీ గెలుపునకు కృషి చెయాలని సుచించారు.ఈకార్యక్రమంలో జిల్లా వైస్ ప్రెసిడెంట్ రాము, మండల అధ్యక్షులు సాయిరెడ్డి, నాయకులు జగదీష్, నవీన్, రవి చంద్ర, తదితరులు పాల్గొన్నారు.

ఎన్నికల అధికారులకు శిక్షణ



బీర్కూర్‌లో అధికారులకు శిక్షణ ఇస్తున్న దృశ్యం

బీర్కూర్, అక్టోబరు 6 (ఆంధ్రజ్యోతి): బీర్కూర్ మండల కేంద్రంలోని ఎంపీడీవో కార్యాలయ సమావేశ మందిరంలో సోమవారం 2025 ఎంపీటీసీ, జడ్పీటీసీ ఎన్నికలకు సంబంధించి ప్రిసైడింగ్ అసిస్టెంట్ ప్రిసైడింగ్ ఆఫీసర్లకు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. 2025 ఎంపీటీసీ, జడ్పీటీసీ ఎన్నికలకు సంబంధించిన అంశాలపై అధికారులకు ఎన్నికల శిక్షణ అధికారులు రామాంజనేయులు, దుర్గాప్రసాద్‌లు శిక్షణ ఇచ్చారు. ఏమైనా అనుమానాలు ఉంటే తమ దృష్టికి తీసుకురావాలని అన్నారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ సాయి భుజంగరావు, ఎంపీడీవో మహబూబ్, సూపరింటెండెంట్ భాను ప్రకాష్, మండల కార్యాలయ సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.



నవీపేటలో కరపత్రాలను ఆవిష్కరిస్తున్న దృశ్యం

17 నుంచి19 వరకు లక్ష్మీ కుబేర హోమం

▸ కరపత్రాలు ఆవిష్కరించిన నిర్వాహకులు

నవీపేట, అక్టోబరు6 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని లింగమయ్య గుట్ట శివాలయంలో ఈ నెల 17 నుంచి 19వరకు జరిగే శ్రీ లక్ష్మీ కుబేర హోమ మహోత్సవానికి సంబంధించిన కరపత్రాలను సోమవారం ఆవిష్కరించారు. ఈ మేరకు సోమవారం స్థానిక లింగమయ్య గుట్ట శివాలయంలో సంబంధిత కరపత్రాలను ఆవిష్కరించారు. మూడు రోజుల పాటు జరిగే ఉత్సవాలలో భాగంగా చివరి రోజైన ఆదివారం 108 హోమ గుండాలతో శ్రీ లక్ష్మీ కుబేర హోమం ఉంటుందని నిర్వాహకులు పేర్కొన్నారు. ఈ ఉత్సవాలను విజయవంతం చేయాలని వారు కోరారు. ఈ కార్యక్రమంలో లింగమయ్య గుట్ట ఆలయ వ్యవస్థాపకులు శ్రీ సిద్ధేశ్వర మహరాజ్, భక్తులు పాల్గొన్నారు.

తీర్థయాత్రలకు చలో.. చలో..

▸ ఐఆర్‌సీటీసీ ప్రత్యేక పర్యాటక రైలు

సుభాష్‌నగర్, అక్టోబరు 6 (ఆంధ్రజ్యోతి): భారతీయ రైల్వే అనుబంధ సంస్థ ఐఆర్‌సీటీసీ తెలుగు ప్రజల కోసం ప్రత్యేక పర్యాటక రైలును అందుబాటులోకి తీసుకువచ్చిందని ఐఆర్‌సీటీసీ జాయింట్ జనరల్ మేనేజర్ కిశోర్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ తీర్థయాత్ర అక్టోబరు 7 నుంచి 16 వరకు ఉంటుందని తెలిపారు. తీర్థయాత్రలో భాగంగా ద్వారకాదీష్ మందిరం, నాగేశ్వర జ్యోతిర్లింగ మందిరం, బేట్ ద్వారక, సోమనాథ్ జ్యోతిర్లింగ మందిరం, సబర్మతి ఆశ్రమం, సూర్య దేవాలయం, రాణికి వావ్, స్టాచ్యూ ఆఫ్ యూనిటీ వంటి పర్యాటక ప్రదేశాలను చూడవచ్చని తెలిపారు. ఒక్కొక్కరికి సాధారణ టిక్కెట్ ధర స్లీపర్ రూ.18,400, 3ఏసీ రూ.30,200, 2ఏసీ రూ.39,900 ఉంటుందని తెలిపారు. ఈ ప్యాకేజీలో మూడు పూటల భోజన వసతి, రవాణా సౌకర్యం, ప్రతి కోచ్‌లో ఐఆర్‌సీటీసీ సిబ్బంది అందుబాటులో ఉంటారని అన్నారు. ఈ అవకాశాన్ని జిల్లా ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. అంతర్జాతీయ పర్యాటక దినోత్సవం సందర్భంగా ఐఆర్‌సీటీసీ 5 శాతం రాయితీ ప్రకటించినట్లు తెలిపారు. మరింత సమాచారం కోసం 9701360701, 9281030711 నెంబర్లను సంప్రదించాలని కోరారు.

మధ్య తరగతికి 'అద్దె'ల దరువు

(3వ పేజీ తరువాయి)

జీవితం ఆర్థిక ఒత్తిడిలో కూరుకుపోతోంది. పెరుగుతున్న అద్దెలు, తగ్గని ఇళ్ల కొరత, నిజామాబాద్ నగరంలో రెండు బెడ్‌రూం ఇళ్లు రూ.10వేల నుంచి 15వేల వరకు, మూడు బెడ్‌రూం ఇళ్లు రూ.20వేల వరకు అద్దె దాటిపోయాయి. డిమాండ్ ఎక్కువగా ఉండటం, కొత్త లేఅవుట్లు తక్కువగా ఉండటం కారణంగా అద్దె మార్కెట్ నియంత్రణ తప్పింది. వచ్చే జీతం సగం అద్దెకు, కుటుంబ ఖర్చులతో సాధారణంగా నెలకు రూ.30వేల జీతం పొందే ఉద్యోగులు దాదాపు సగం అద్దెకు వెచ్చిస్తున్నారు. మిగిలినదంతా విద్య, వైద్యం, కరెంట్, రేషన్ ఖర్చుల్లో ముగుస్తోంది.

చిన్న వ్యాపారులు, ప్రైవేట్ ఉద్యోగులు ఈ భారాన్ని మోయలేక అప్పుల్లో కూరుకుపోతున్నారు. పిల్లల స్కూల్ ఫీజులు, ఇంధన ధరలు పెరుగుతున్నాయి. ఇల్లు అద్దె కూడా రెట్టింపు అయ్యింది. ఇంట్లో ఒకే జీతంతో జీవించడం కష్టమైపోతోంది. గృహ యజమానుల ఇష్టం వచ్చినట్లు అద్దెలు పెంచుతుండటం అలవాటుగా మారింది. డిపాజిట్ కూడా రూ.30వేల నుంచి రూ.50వేల వరకు అడుగుతున్నారు. చాలా సందర్భాల్లో లిఖిత పూర్వక ఒప్పందాలు లేకపోవడంతో అద్దెదారులు చట్టపరమైన రక్షణ లేకుండా ఉంటున్నారు. అద్దె ఒప్పందం లేదు కాబట్టి యజమాని ఎప్పుడు అద్దె పెంచినా అడ్డు చెప్పలేక పిల్లల చదువుల కోసం ఇల్లు మార్చలేక కష్టపడుతున్నారు.

ప్రభుత్వ పథకాలు మధ్యతరగతికి దూరమవుతున్నాయి. డబుల్ బెడ్‌రూం ఇండ్ల పథకం పేదలకు మాత్రమే వర్తిస్తుండగా, మధ్యతరగతి ప్రజలకు తగిన గృహ పథకాలు లేవు. అద్దె నియంత్రణ చట్టం అమలు సడలింపులో ఉండటంతో యజమానుల ఆధిపత్యం కొనసాగుతోంది. ప్రభుత్వం సబ్సిడీ హౌసింగ్ లోన్లు, అద్దె సహాయ పథకాలు తీసుకురావాల్సిన అవసరం ఉందని నిపుణులు సూచిస్తున్నారు. సుస్థిర నివాస విధానం, కాలానుగుణ అవసరం, నగర జనాభా పెరుగుతున్న నేపథ్యంలో నిజామాబాద్ మునిసిపాలిటీ స్మార్ట్‌సిటీ ప్రణాళికల్లో మధ్యతరగతి ఆవాసాలను కూడా చేర్చాలని సూచిస్తున్నారు. తక్కువ వడ్డీ రుణాలు, అద్దె నియంత్రణ బోర్డు ఏర్పాటు, అద్దెదారులకు చట్టబద్ధ రక్షణ వంటి చర్యలు అవసరం ఉంది. ఇల్లు కేవలం గోడల సమూహం కాదు, ఒక కుటుంబ గౌరవం. ప్రతి మధ్యతరగతి వ్యక్తి తలదాచుకునే ఇల్లు కలిగి ఉండాలని కలగంటాడు. కానీ నేటి పరిస్థితుల్లో ఆ కలను నెరవేర్చుకోవడం దూరమవుతోంది.

అద్దె భారం భరించలేం...

మేము మూడు సంవత్సరాల క్రితం రూ.7వేలకు అద్దె ఇల్లు తీసుకున్నాం. ఇప్పుడు అదే ఇల్లు రూ.13వేలు అడుగుతున్నారు. ఇంతకంటే మరో నగరానికి వెళ్లడం తప్ప దారి కనిపించడం లేదని నగరంలోని ఆర్మూర్ రోడ్‌లో ఉండే రమేష్ బ్యాంకు ఉద్యోగి తెలిపాడు. **- రమేష్, బ్యాంక్ ఉద్యోగి**

అదే ఉత్కంఠ..

(3వ పేజీ తరువాయి)

గతంలో సుప్రీం కోర్టు ఇచ్చిన తీర్పు ఉండగా సోమవారం సుప్రీం కోర్టు హైకోర్టులో రిజర్వేషన్లకు వ్యతిరేకంగా పిటిషన్‌లు పెండింగ్‌లో ఉండగా తాము నిర్ణయం తీసుకోమని తేల్చి చెప్పడంతో ఈనెల 8న హైకోర్టు తీర్పు ఉన్న నేపథ్యంలో అందరి దృష్టి ఇప్పుడు దానిపైనే ఉంది. బీసీలకు 42 శాతం రిజర్వేషన్లతో పాటు జిల్లా వ్యాప్తంగా జెడ్పీటీసీ, ఎంపీటీసీ రిజర్వేషన్లు తమకు అనుకూలంగా రాని ఆశావాహులంతా ఈనెల 8న హైకోర్టు తీర్పు కోసం ఉత్కంఠగా ఎదురు చూస్తున్నారు. కోర్టు తీర్పు రిజర్వేషన్లకు అనుకూలంగా వస్తే ఇవే రిజర్వేషన్లు కొనసాగే అవకాశం ఉంది. ప్రతికులంగా వస్తే మాత్రం మళ్లీ రిజర్వేషన్లు మారే అవకాశం ఉండటంతో అన్ని పార్టీల ఆశావాహులు బుధవారం హైకోర్టు ఇచ్చే తీర్పు కోసం ఎదురు చూస్తున్నారు.

అభ్యర్థులను ఖరారు చేయని పార్టీలు..

స్థానిక సంస్థల ఎన్నికలకు సంబంధించి గత నెల 29న రాష్ట్ర ఎన్నికల సంఘం షెడ్యూల్‌ను విడుదల చేసింది. ఈనెల 9వ తేదీన ఎన్నికల నోటిఫికేషన్ విడుదల కానున్న నేపథ్యంలో బీసీలకు 42 శాతం రిజర్వేషన్లను సవాలు చేస్తూ కొంత మంది హైకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. ఈనెల 8న హైకోర్టులో ఆ పిటిషన్ విచారణకు రానున్న నేపథ్యంలో హైకోర్టు తీర్పు ఏ విధంగా వెలువడుతుందోనన్న ఉత్కంఠ అన్ని రాజకీయ పార్టీలలో ఉంది. ఇప్పటికే అన్ని రాజకీయ పార్టీలు జెడ్పీటీసీ, ఎంపీటీసీ అభ్యర్థులను ఖరారు చేయాల్సి ఉన్న నేపథ్యంలో కోర్టు తీర్పు ఏవిధంగా వస్తుందోనని పార్టీ నాయకులు సమాలోచనలు చేస్తున్నారు. ఆశావాహుల జాబితాను ఇవ్వాలని కాంగ్రెస్ పార్టీ అధిష్ఠానం ఆదేశాలు ఇచ్చిన ఇంకా ఆశావాహుల జాబితాను సిద్ధం చేయలేదు. ముగ్గురు, నలుగురితో ఆశావాహుల జాబితా పంపాలని పార్టీ నేతలు చెప్పిన జిల్లా నేతలు మాత్రం ఆచి తూచి వ్యవహరిస్తున్నారు. ఎవరి పేర్లు పంపితే ఎవరు నొచ్చుకుంటారోనన్న అనుమానాలతో జాబితాను పంపడం లేదు. అసలు ఇప్పటికే ప్రకటించిన రిజర్వేషన్లు ఉంటాయో ఉండవోనన్న అనుమానాలతో అన్ని పార్టీల నేతలు ఉన్నారు. ఈ నెల 8న హైకోర్టు ఇచ్చే తీర్పుకు అనుగుణంగా అభ్యర్థులను ఖరారు చేసేందుకు ప్రధాన రాజకీయ పార్టీలు సన్నద్ధం అవుతున్నాయి.

నిఘా నేత్రాలకు చత్వారం



▸ పోలీస్ మినహా పనిచేయని సీసీ కెమెరాలు
▸ కొన్ని నెలలుగా కూడలిళ్లలో లోపించిన నిఘా
▸ గతంలో ఆర్భాటంగా ఏర్పాటు
▸ ప్రస్తుతం పట్టింపు కరవు

కోటగిరి, అక్టోబరు 6(ఆంధ్రజ్యోతి): ఒక్క సీసీ కెమెరా వంద మంది పోలీసులతో సమానమని అధికార యంత్రాంగం చెబుతుంది. నిరంతర నిఘా నేర నియంత్రణలో, కేసుల ఛేదనలో పోలీసులకు కీలకంగా మారుతున్న సీసీ కెమెరాల నిర్వహణ పట్టించుకోకపోవడం విస్మయానికి గురి చేస్తుంది. గతంలో ఆర్భాటంగా ఏర్పాటు చేసిన ప్రస్తుతం వాటిలో చాలా మట్టుకు పని చేయడం లేదు. ప్రజల భాగస్వామ్యంతో దుకాణ సముదాయాలలో, నివాస సముదాయాలలో నిఘా నేత్రాలు ఉండేలా అవగాహన కల్పించారు. ప్రధాన కూడలిలో చాలా చోట దృశ్యాలు నిక్షిప్తం కావడం లేదని ప్రజలు ఆరోపిస్తున్నారు. పోలీసుల కేసుల పరిశోధనకు ఇబ్బందులు సైతం ఎదురవుతున్న సంబంధాలు ఉన్నాయి. కోటగిరి, పోతంగల్ మండల కేంద్రాల్లోని ప్రధాన చౌరస్తాలు, గ్రామ పొలి మేరల్లో ఏర్పాటు చేసిన కెమెరాలు ఉన్న అవి పని చేయడం లేదు. దోపిడిలను అరికట్టేందుకు ప్రజలను ప్రోత్సహించి గతంలో పోలీసు అధికారులు సీసీ కెమెరాలు ఏర్పాటు చేయించారు. అయితే వాటి నిర్వహణ అస్తవ్యస్తంగా మారడంతో నిఘా నేత్రాలు నిద్రపోతున్నాయి. ఫలితంగా దొంగతనాలు జరిగినా, దొంగలు సులువుగా తప్పించుకునే అవకాశాలు ఉన్నాయి.

● ప్రధాన కూడలిలో నిద్రపోతున్న నిఘా నేత్రాలు

కోటగిరి మండల కేంద్రంలోని బస్టాండ్ ప్రాంగణం మినహా పోతంగల్ రోడ్డు, కొత్తపల్లి రోడ్డు, ఎన్‌టీఆర్ చౌరస్తా, కొత్త బస్టాండ్ ప్రాంగణాలలో ఏర్పాటు చేసిన సీసీ కెమెరాలు పని చేయడం లేదు. మూడేళ్ల క్రితం సీసీ కెమెరాలను ఏర్పాటు చేసి పోలీస్ స్టేషన్‌కు అనుసంధానం చేశారు. సంవత్సరం పాటు పని చేసిన సీసీ కెమెరాలు తదనంతరం నిర్వహణ కరువై పని చేయడం లేదు. పోతంగల్ మండల కేంద్రంలోనూ ఇదే పరిస్థితి నెలకొంది. బస్టాండ్ ప్రాంగణంతో పాటు తహసీల్దార్ కార్యాలయం ఎదుట ఏర్పాటు చేసిన సీసీ కెమెరాలు అలంకార ప్రాయంగా మారాయి. పలు చోట్ల సీసీ కెమెరాలు ఒకటి ఆకాశాన్ని చూస్తే మరొకటి భూమిని చూసే పరిస్థితి నెలకొంది. సీసీ కెమెరాకు సంబంధించి మరమ్మత్తులు, నిర్వహణ పట్టించుకోకపోవడంతో ప్రస్తుతం పనిచేయడం లేదు.

● పెరుగుతున్న నేరాలు

సీసీ కెమెరాలు పని చేయకపోవడంతో ఉమ్మడి మండలంలో నేరాలు పెరుగుతున్నాయి. సీసీ కెమెరాలు పని చేస్తుంటే చోరీలు, నేరాలను అరికట్టవచ్చని అవి పని చేయకపోవడంతో చోరీలు చేసి తప్పించుకుంటున్నారని పలువురు వాపోతున్నారు. ఇటీవల పలు గ్రామాలలో చోరీలు జరిగాయి. చోరీ కేసులో నిందితులను పట్టుకునేందుకు పోలీసులు తీవ్రంగా శ్రమించాల్సి వచ్చింది.

● యథేచ్ఛగా ఇసుక, మొరం అక్రమ రవాణా

కోటగిరి మండలంలో మొరం రాత్రి, పగలు తేడా లేకుండా అక్రమ రవాణా జరుగుతుంటే పోతంగల్ మండలంలో ఇసుక అక్రమంగా రవాణా జరుగుతోంది. పోతంగల్ నుండి ఇసుకను ట్రాక్టర్‌లలో, టిప్పర్‌లలో అక్రమంగా తరలిస్తున్నారు. సీసీ కెమెరాలు పని చేయకపోవడంతో అక్రమ రవాణాకు మరింత అవకాశం కలిగింది. మరో వైపు పోతంగల్ మండలం మహరాష్ట్రకు సరిహద్దున ఉండడంతో రాత్రివేళ మహరాష్ట్ర నుంచి జీరో వ్యాపారం జోరుగా రాష్ట్రంలోకి ప్రవేశిస్తుంది. చెక్‌పోస్ట్ ఉన్న నామమాత్రంగా ఉంది. మంజీర వంతెన సమీపంలో కెమెరాలు లేకపోవడంతో జీరో దందాకు మార్గం సులభమైంది. ఇప్పటికైన అధికారులు స్పందించి కెమెరాలను ఏర్పాటు చేయాలని ప్రజలు కోరుతున్నారు.

మరమ్మత్తులు చేయించాలి



మండల కేంద్రంతో పాటు మేజర్ గ్రామ పంచాయతీల్లో సీసీ కెమెరాలు ఏర్పాటు చేశారు.అవి పని చేయడం లేదు. సీసీ కెమెరాలకు మరమ్మత్తులు చేయించి వాటిని వినియోగంలోకి తీసుకురావాలి. లేకపోతే నేరాలు పెరిగే అవకాశముంది.

- ఈర్షద్, కోటగిరి

వినియోగంలోకి తీసుకువస్తాం



మండల కేంద్రంలో పని చేయని సీసీ కెమెరాలను గుర్తించి మరమ్మత్తులు చేయిస్తాం. మరి కొన్ని సీసీ కెమెరాలను ఏర్పాటు చేయించడానికి ప్రయత్నం చేస్తున్నాం. సీసీ కెమెరాలను ఏర్పాటు చేసుకునే విషయంపై వ్యాపారస్తులకు అవగాహన కల్పిస్తున్నాం.

- సునీల్, ఎస్ఐ కోటగిరి

వ్యవసాయ మార్కెట్‌లో వసూల్ రాజా..!

(3వ పేజీ తరువాయి)

కేటాయించేందుకు అధికారులు నిర్ణయం తీసుకున్నారు. రూరల్ నియోజకవర్గంలో ఉన్న స్థలంలో ఇళ్ల నిర్మాణం చేయడంతో ఆ నియోజకవర్గానికి 50, నిజామాబాద్ అర్బన్ నియోజకవర్గానికి 202 ఇళ్లను కేటాయించేందుకు అధికారులు సన్నాహాలు చేస్తున్నారు. మరో పక్షం రోజుల్లో లబ్ధిదారులకు లక్కీడ్రా ద్వారా డబుల్ బెడ్‌రూంలను పంపిణీ చేసేందుకు అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు.

ఒక్కో ఇంటికి రూ. 50 వేలు

నిజామాబాద్ శ్రద్ధానంద్ గంజ్‌లో గుమస్తా, దడ్వాయి, చాటా, హమాలీలకు యూనియన్‌లు ఉన్నాయి. వీటికి అధ్యక్ష, కార్యదర్శులతో పాటు ఇతర కార్యవర్గం ఉంది. జిల్లా అధికారులు గంజ్‌లో పనిచేసే కార్మికులకు డబుల్ బెడ్‌రూంలు ఇచ్చేందుకు సూచన ప్రాయంగా అంగీకారం తెలిపారు. అయితే ఆ విషయం తెలుసుకున్న మార్కెట్ కమిటీకి చెందిన ఓ నేత సంఘ నేతలతో బేరసారాలకు దిగినట్లు సమాచారం. ఆ నాలుగు సంఘాలలోని కీలక నేతలతో మాట్లాడి ఒక్కో సంఘానికి 40 చొప్పున మొత్తం 120 ఇళ్లను మంజూరు చేయిస్తానని నమ్మబలికాడు. ఒక్కో ఇంటికి రూ.30వేల నుంచి రూ.50వేలు ఇవ్వాలని బేరం కుదుర్చుకున్నట్లు ఆరోపణలు వస్తున్నాయి.

విభేదాలతో విషయం బయటికి...

చాలా మంది గుమస్తా, హమాలీ, దడ్వాయి, చాటా కార్మికులు అనేక ఏళ్లుగా గంజ్‌లో పనిచేస్తున్నారు. అయినా వారికి ఎలాంటి ఇంటి స్థలం, ఇళ్లు లేవు. అయితే వారికి సమాచారం లేకుండానే ఇతరులు తమకు ఇళ్లు వస్తున్నాయని చెప్పడంతో విషయం బయటకు వచ్చింది. తాము సీనియర్లమైనా తమకు ఎందుకు ఇళ్లు ఇవ్వరని, డబ్బులు ఇస్తేనే ఇళ్లు ఇస్తారా అంటూ యూనియన్ సమావేశంలో వాగ్వాదానికి దిగినట్లు తెలిసింది. ఇందులో కొంత మంది యూనియన్ నాయకులు తమకు అనుకూలంగా ఉన్న వారిని ఎంపిక చేసుకొని ఫోన్‌లు చేసి మరీ డబ్బులు రెడీ చేసుకోవాలని చెప్పినట్లు తెలిసింది. ఆ విషయం ఆనోట ఈనోట సీనియర్ కార్మికులకు చేరడంతో వారు సంఘ నాయకులను నిలదీసినట్లు సమాచారం. ఇళ్లు వస్తేనే డబ్బులు ఇవ్వాలని సంఘ నాయకులు మళ్లీ మాట మార్చినట్లు ప్రచారం జరుగుతోంది.

మా స్కూల్‌కు రాకండి..!

▸ ఫీజు చెల్లిస్తేనే బడిలోకి అనుమతి
▸ విడుదల కాని బకాయిలు
▸ బెస్ట్ అవైలబుల్ స్కూళ్ల నిర్ణయం

ఇందూరు, అక్టోబరు 6 (ఆంధ్రజ్యోతి): ఎస్సీ, ఎస్టీ విద్యార్థులకు ప్రైవేటు విద్యను అందించేందుకు రూపొందించిన బెస్ట్ అవైలబుల్ స్కూల్ స్కీమ్ గత నాలుగేళ్లుగా ప్రభుత్వం నుంచి బకాయిలు విడుదల కాకపోవడంతో ప్రైవేటు పాఠశాలలు విద్యార్థులను తమ స్కూళ్లకు రావద్దని మెస్సేజ్‌లు పంపారు. దసరాకు ముందే బకాయిలు విడుదల చేస్తామని ప్రభుత్వం ప్రకటించినప్పటికీ ఇంకా ప్రభుత్వం నుంచి ఎలాంటి స్పందన లేకపోవడంతో ప్రభుత్వ పాఠశాలలు తమ స్కూళ్లలో చదువుతున్న విద్యార్థులకు ఫీజు చెల్లిస్తేనే స్కూల్‌కి రావాలని సందేషాలు పంపారు. దసరా సెలవులకు సొంత ఇంటికి వెళ్లిన విద్యార్థులు సోమవారం పాఠశాలలు పునఃప్రారంభం కాగా బెస్ట్ అవైలబుల్ స్కూల్ స్కీమ్‌లో ఉన్న పాఠశాలలు విద్యార్థులకు ముందుగానే సందేషాలు పంపారు. ఫీజులు చెల్లిస్తేనే విద్యార్థులను పాఠశాలలోకి అనుమతిస్తామని తెగేసి చెప్పారు. ప్రభుత్వం బకాయిలు విడుదల చేయకపోవడంతో రాష్ట్ర వ్యాప్తంగా ఈ స్కీమ్‌లో ఉన్న స్కూల్‌లు ఈ నిర్ణయం తీసుకున్నాయి. జిల్లావ్యాప్తంగా 12 పాఠశాలలు ఈ స్కీమ్‌లో ఉండగా గత నాలుగేళ్లుగా సుమారు 12కోట్ల బకాయిలు రావాల్సి ఉంది. జిల్లాలో 12 పాఠశాలల్లో 3వ తరగతి నుంచి 10వ తరగతి వరకు ఎస్టీ విద్యార్థులు, 1 నుంచి 10వ తరగతి వరకు ఎస్సీ విద్యార్థులు డేస్ స్కాలర్, రెసిడెన్షియల్ విధానంలో చదువుతున్నారు. జిల్లావ్యాప్తంగా 1800 మంది విద్యార్థులు ఈ స్కీమ్ కింద చదువుతున్నారు. ప్రభుత్వం డేస్కాలర్‌కు రూ.28వేలు ఏడాదికి, 40వేలు రెసిడెన్షియల్ కొరకు చెల్లిస్తుంది. విద్యాసంవత్సరం మధ్యలో ప్రైవేటు విద్యాసంస్థలు విద్యార్థులను పాఠశాలల్లోకి రానివ్వకపోవడంతో విద్యార్థులు, తల్లిదండ్రులు ఇబ్బందులు పడుతున్నారు. అప్పులు చేసి పాఠశాలలను నిర్వహిస్తున్నామని తమ బాధను అర్థం చేసుకోవాలని ప్రైవేటు పాఠశాలల యాజమాన్యాలు తల్లిదండ్రులకు విజ్ఞప్తి చేస్తున్నాయి. బకాయిలు విడుదలై విద్యార్థులు బడులకు వెళ్తారా లేక ఇతర బడుల్లో చేర్పిస్తారా అనేది తేలాల్సి ఉంది.

పోలీస్ ప్రజావాణికి 18 ఫిర్యాదులు

సుభాష్‌నగర్, అక్టోబరు 6 (ఆంధ్రజ్యోతి):ప్రజలు నిర్భయంగా మూడో వ్యక్తి ప్రమేయం లేకుండా ఎలాంటి పైరవీలు లేకుండా స్వచ్ఛందంగా పోలీస్ సేవలను వినియోగించుకోవాలని సీపీ సాయిచైతన్య అన్నారు. జిల్లాకేంద్రంలోని కమీషనరేట్‌లో సోమవారం పోలీస్ ప్రజావాణి నిర్వహించారు. కార్యక్రమానికి జిల్లాలోని వివిధ ప్రాంతాల నుంచి 18 ఫిర్యాదులు అందాయి. ఫిర్యాదుదారుల సమస్యలను విని, చట్టప్రకారం పరిష్కరించాలని సంబంధిత అధికారులకు సూచించారు. శాంతిభద్రతలను పరిరక్షిస్తూ ముందుకు సాగడమే లక్ష్యంగా జిల్లా పోలీస్ శాఖ పనిచేస్తుందని సీపీ సాయిచైతన్య పేర్కొన్నారు.

దరఖాస్తుల ఆహ్వానం

సుభాష్‌నగర్, అక్టోబరు 6 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ పారామెడికల్ బోర్డు, పారామెడికల్ కోర్సులకు డీఎంఎల్‌టీ 30 సీట్లు, డయాలసిస్ 10 సీట్ల కోసం దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు ప్రభుత్వ వైద్య కళాశాల ప్రిన్సిపల్ కృష్ణమోహన్ తెలిపారు. దరఖాస్తులు ఈనెల 8 నుంచి 28వరకు స్వీకరిస్తున్నట్లు తెలిపారు. ఉదయం 10.30 నుంచి సాయంత్రం 4గంటల వరకు పనిదినాల్లో దరఖాస్తులను స్వీకరిస్తున్నట్లు చెప్పారు. ప్రభుత్వ మెడికల్ కళాశాలలో అందజేయాలన్నారు.

బోధన్ ఏటీవోగా బానోత్ గంగూలీ



బానోత్ గంగూలీ

బోధన్, అక్టోబరు6 (ఆంధ్రజ్యోతి): బోధన్ ఏటీఓగా బానోత్ గంగూలీ బాధ్యతలు చేపట్టారు. ఇటీవల విడుదలైన గ్రూపు 1 ఫలితాల్లో ఉత్తీర్ణత సాధించి బోధన్ ఏటీఓగా ఉద్యోగం సాధించారు. లింగంపేట మండలం కొండాపూర్ తండాకు చెందిన బానోత్ గంగూలీ చదువంతా ప్రభుత్వ విద్యాలయాల్లో కొనసాగింది. ప్రభుత్వ పాఠశాల, కళాశాలలో చదివి ప్రభుత్వ ఉద్యోగం సాధించి బోధన్ ఏటీఓగా బాధ్యతలు చేపట్టిన బానోత్ గంగూలీకి బోధన్ సబ్ కలెక్టర్ వికాస్ మహతో, పలువురు అధికారులు పట్టణ ప్రముఖులు అభినందించారు.

గెలుపు గుర్రాలకే టికెట్లు

● బోధన్ ఎమ్మెల్యే సుదర్శన్ రెడ్డి



మాట్లాడుతున్న బోధన్ ఎమ్మెల్యే సుదర్శన్ రెడ్డి

నవీపేట,అక్టోబరు6 (ఆంధ్రజ్యోతి): స్థానిక సంస్థల ఎన్నికల్లో గెలుపు గుర్రాలకే టిక్కెట్లు కేటాయిస్తామని బోధన్ ఎమ్మెల్యే సుదర్శన్‌రెడ్డి అన్నారు. సోమవారం మండలకేంద్రంలో జరిగిన కాంగ్రెస్ మండల కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఎంపీటీసీ స్థానాలలో ఎక్కువ మంది టిక్కెట్టు కోసం పోటీ పడితే ఒక్కరికి టిక్కెట్టు వస్తుందని, మిగిలిన వారు పార్టీ సూచించిన అభ్యర్థి గెలుపునకు కృషి చేయాలని కోరారు. భవిష్యత్‌లో కార్యకర్తలకు మరిన్ని పదవులు అందించే అవకాశాలు ఉన్నాయని పేర్కొన్నారు. జడ్పీటీసీ స్థానంతో పాటు మండలంలోని అన్ని ఎంపీటీసీ స్థానాలను కాంగ్రెస్ కైవసం చేసుకుంటుందని ధీమా వ్యక్తం చేశారు. వివిధ గ్రామాలకు చెందిన పలువురు ఎమ్మెల్యే సమక్షంలో పార్టీలో చేరారు. కార్యక్రమంలో రాష్ట్ర ఉర్దూ అకాడమీ చైర్మన్ తాహెర్, జిల్లా గ్రంథాలయ సంస్థ అధ్యక్షుడు రాజిరెడ్డి, డీసీసీబీ చైర్మన్ రమేష్‌రెడ్డి, జిల్లా కాంగ్రెస్ అధ్యక్షుడు మానాల మోహన్ రెడ్డి, నిజామాబాద్ ఏఎంసీ వైస్ చైర్మన్ జే.రాంచందర్, శ్రీనివాస్ గౌడ్, రాజేందర్ గౌడ్, గోవర్ధన్ రెడ్డి, మోస్రా సాయిరెడ్డి పాల్గొన్నారు.

స్థానిక సంస్థలన్నీ మావే: ఎంపీ అర్వింద్



బీజేపీలో చేరిన వారితో ఎంపీ అర్వింద్, తదితరులు

రెంజల్, అక్టోబరు6(ఆంధ్రజ్యోతి): రానున్న స్థానిక సంస్థల ఎన్నికలలో బీజేపీ అన్ని స్థానాలను కైవసం చేసుకుంటుందని ఎంపీ ధర్మపురి అర్వింద్ ధీమా వ్యక్తం చేశారు. మండలంలోని బీఆర్ఎస్, కాంగ్రెస్‌కు చెందిన నాయకులు సోమవారం బీజేపీ మండల అధ్యక్షుడు క్యాతం యోగేష్ ఆధ్వర్యంలో హైదరాబాద్‌లోని ఎంపీ అరవింద్ నివాసంలో బీజేపీలో చేరారు. కళ్యాపూర్‌కు చెందిన మాజీ ఎంపీటీసీ షైని మోహన్, బోర్గాంకు చెందిన శ్రీనివాస్ రెడ్డి, మోహన్‌రెడ్డి, బీఆర్ఎస్‌కు చెందిన మాజీ సొసైటీ డైరెక్టర్ సాయిరెడ్డికి పార్టీ కండువా వేసి బీజేపీలోకి ఆహ్వానించారు. మోడీ ప్రభుత్వం చేస్తున్న అభివృద్ధిని చూసి వివిధ పార్టీలకు చెందిన నాయకులు పార్టీలో చేరుతున్నారని పేర్కొన్నారు. నరేంద్ర మోడీ దేశ ప్రధానిగా సమర్థవంతమైన పాలనే ఇందుకు నిదర్శనమన్నారు. పార్టీ కార్యకర్తలందరు సమష్టిగా సర్పంచ్, ఎంపీటీసీ, ఎంపీపీ, జడ్పీటీసీ స్థానాలను బీజేపీ పార్టీ బలపర్చిన అభ్యర్థిని గెలిపించుకోవాలన్నారు. కేంద్ర ప్రభుత్వం అమలుచేస్తున్న పథకాలను గడప గడపకు తీసుకెళ్లాలని సూచించారు. కాంగ్రెస్ వైఫల్యాలను ఎండగట్టాలని పేర్కొన్నారు. కార్యక్రమంలో బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు మేడపాటి ప్రకాష్ రెడ్డి, మండల స్థానిక ఎన్నికల ఇన్‌చార్జి కూరేళ్ల శ్రీధర్, బీజేపీ మండల ప్రధాన కార్యదర్శి గాండ్ల ప్రసాద్, ఉపాధ్యక్షులు ప్రసాద్, నాగరాజు, గంగాదాసు, అనిల్ తదితరులు పాల్గొన్నారు.

భట్టిని కలిసిన గ్రూప్-1 ఉద్యోగి



ఆనంద్‌కుమార్‌ను అభినందిస్తున్న డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క

ఇందూరు, అక్టోబరు6 (ఆంధ్రజ్యోతి): అసిస్టెంట్ ఆడిట్ ఆఫీసర్‌గా నిజామాబాద్ జిల్లాలో బాధ్యతలు స్వీకరించిన మాదరి ఆనంద్‌కుమార్ డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్కను మర్యాదపూర్వకంగా కలిశారు. ఇటీవల కాంగ్రెస్ ప్రభుత్వం విడుదల చేసిన గ్రూప్-1 ఫలితాలలో ఆనంద్ అసిస్టెంట్ ఆడిట్ ఆఫీసర్‌గా ఎంపికై సెప్టెంబరు 27న జిల్లా కేంద్రంలోని ఐడీఓసీలోని కార్యాలయంలో విధుల్లో చేరారు.

బిల్లుల కోసం హైకోర్టుకు..

(3వ పేజీ తరువాయి)

సిబ్బంది జీతాలు, అత్యవసర నిర్వహణ తలకు మించిన భారం కావడంతోపాటు కాంట్రాక్టర్ తన బిల్లుల కోసం హైకోర్టును ఆశ్రయించడం అధికారులకు తలనొప్పిగా మారింది. చేసేదేమి లేక బోధన్ మున్సిపల్ కమిషనర్ హైకోర్టును ఆశ్రయించేందుకు సిద్ధమవుతున్నారు. దీనిపై మున్సిపల్ కమిషనర్‌ను వివరణ కోరగా కాంట్రాక్టర్‌కు బిల్లులు చెల్లించాల్సిన విషయం వాస్తవమేనన్నారు. నిధులు లేకపోవడంతో 2రోజుల్లో కోర్టుకు హాజరై నిధులు వచ్చాక బకాయిలు చెల్లించేలా చర్యలు చేపడతామని కోర్టుకు వివరణ ఇస్తామన్నారు.

పోలీసులు జాగ్రత్త వహించాలి

ఇందల్వాయి, అక్టోబరు6 (ఆంధ్రజ్యోతి): స్థానిక సంస్థల ఎన్నికల్లో జాగ్రత్తగా విధులను నిర్వహించాలని డిచ్‌పల్లి సీఐ వినోద్ సిబ్బందికి సూచించారు. మండల స్టేషన్‌లో సమావేశం నిర్వహించి, సూచనలు చేశారు. గ్రామాల్లోని విలేజ్ పోలీస్ ఆఫీసర్లు సమాచారం అందించాలన్నారు. కార్యక్రమంలో ఎస్సై సందీప్ పాల్గొన్నారు.

సినిమా గైడ్

దేవి : మిరాయి (11.15, 2.15, 6.15, 9.15)
విజయ్ : కాంతారా చాప్టర్-1 (11.15, 2.15, 6.15, 9.15)
నటరాజ్ : కాంతారా చాప్టర్-1 (హిందీ) (11.15, 2.15, 6.15, 9.15)
లలితామహాల్ : ఓజి (తెలుగు) (11.15, 2.15, 6.15, 9.15)

ఉషాప్రసాద్ మల్టీప్లెక్స్

స్క్రీన్-1 : ఓజి (తెలుగు) (10.30, 1.30, 4.30, 7.30, 10.30)
స్క్రీన్-2 : కాంతారా చాప్టర్-1 (11.00)
: ఇడ్లీ కొట్టు (1.50, 4.35, 10.35)
స్క్రీన్-3 : కాంతారా చాప్టర్-1 (1.30, 4.30, 7.30, 10.25)

పీవీఆర్ మల్టీప్లెక్స్ (వేణుమాల్)

స్క్రీన్-1 : కాంతారా చాప్టర్-1 (9.00, 12.25, 3.50, 7.15, 10.40)
స్క్రీన్-2 : ఓజి (తెలుగు) (10.10, 1.20, 4.30, 7.40, 10.50)
స్క్రీన్-3 : కాంతారా చాప్టర్-1 (10.10, 7.35)
: సన్నీ సంస్కారికి తులసీకుమారి (హిందీ) (1.35, 11.00)
: ఇడ్లీ కొట్టు (4.30)
స్క్రీన్-4 : సన్నీ సంస్కారికి తులసీకుమారి (హిందీ) (10.05, 7.50)
: కాంతారా చాప్టర్-1 (1.00)
: మిరాయి (4.25)
: ఇడ్లీ కొట్టు (10.45)



బిస్కెట్ (10 గ్రా.)	ఆర్నమెంట్(10 గ్రా.)	వెండి(10 గ్రా.)
రూ.1,25,000	రూ.1,14,885	రూ.1590

రకం	లైవ్	విత్‌స్కిన్	స్కిన్‌లెస్
సుగుణ (కిలో)	రూ.170	రూ.260	రూ. 280
వెన్‌కాబ్(కిలో)	రూ.175	రూ.265	రూ. 285



అప్రమత్తతతోనే సైబర్ మోసాలకు ముకుతాడు

(3వ పేజీ తరువాయి)

జరుగుతున్న నేరాలపై చైతన్యం తెస్తున్నామని అన్నారు. ప్రతీ పోలీస్ స్టేషన్ పరిధిలో సైబర్ వారియర్‌ను ఏర్పాటు చేసి సైబర్ నేరాలపై విద్యార్థులకు, ప్రజలకు అవగాహన కల్పిస్తున్నామన్నారు. యువతను నిరుద్యోగ అవకాశాల పేరుతో సైబర్ నేరాల బాధితులు తక్కువ సమయంలో ఎక్కువ డబ్బులు సంపాదించాలని ఆశచూపి డబ్బులను లూటీ చేస్తున్నారని అన్నారు. నిజామాబాద్ సీసీపీఎస్‌లో మార్చి 25 నుంచి సెప్టెంబర్ 2025 వరకు మొత్తం 33 సైబర్ కేసులు నమోదు అయ్యాయని తెలిపారు. ఇప్పటి వరకు రూ.4కోట్ల 92లక్షల 54వేల 875 రికవరీ చేశామన్నారు. నిజామాబాద్ నగరంలోని ఓ వ్యాపార పెట్టుబడి మోసంలో రూ.10లక్షల 51వేల 533 డబ్బులు కోల్పోతే రూ.7లక్షల 89వేల 979 రికవరీ చేశామన్నారు. ఆర్మూర్ డివిజన్‌లో రూ.52లక్షల 50వేల 287 మోసపోతే అందులోంచి రూ.27లక్షల 25వేల 725 తిరిగి ఇప్పించామని తెలిపారు. మరో కేసులో రూ.30లక్షల 81వేలు మోసపోతే రూ. 20లక్షల 81వేలు రికవరీ చేశామన్నారు. సైబర్ నేరాల బృందం సభ్యులు ఏసీపీ వై.వెంకటేశ్వర్‌రావు, సీఐ మహమ్మద్ ముఖీద్ పాషా, ఎస్సై ప్రవళిక, హెడ్‌కానిస్టేబుల్ శ్రీనివాస్, కానిస్టేబుల్ శ్రీరాం, సురేష్, నాగభూషణం, నరేష్, ప్రవీణ్, రాఘవేంద్ర, సుమలత, శృతి, రమ్యలు రికవరీలు చేయడంలో ముఖ్యపాత్ర పోషించారని తెలిపారు. సైబర్ నేరాలపై అప్రమత్తంగా ఉండలాన్నారు.